నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 24-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 81 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

డాలర్లమాయ
సిస్తుకట్టని సొమ్ము
తెల్లబజారు.

దయా హృదయం
ముసరదు గ్రహణం
అంతా వెన్నెలే.

గండశిలలు
వరదకు ఇసుక
కవి పాటలు.

నడుము నొప్పి
మొసలి నడకాసనం
కృషి యే ఫలం.

బలి భోజనం
నరమాంస వంటకం
దైత్యజననం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

తప్పు ఒప్పు తెలియచెప్పి
విద్య నేర్పే గురువులు !
జ్ఞానమిచ్చి కాపాడే
ప్రాణవాయు తరువులు !.

ముఖమున్నా మూగనోళ్లు
సార్లు లేని బళ్ళు !
మొక్కుకున్న వరమీయని
గుళ్ళు లేని రాళ్లు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

వాస్తవిక జీవితం నుంచే మంచి పాటలు

సభలో ప్రసంగిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి

సభలో ప్రసంగిస్తున్న డా॥ ఏనుగు నరసింహారెడ్డి

వాస్తవిక జీవితం నుంచే మంచి పాటలు పుట్టుకొస్తాయని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలుగు సాహితీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం రెండో రోజు లిటరరీ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ ఉద్యమ పాటలు రాయడం వల్లే సినిమా వారు తన వద్దకు వచ్చారని అన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత జేకే భారవి మాట్లాడుతూ పాట పుట్టిన తర్వాత లిటరరీ ఫెస్ట్ పేరుతో పాటకు జేజేలు పలకడం గొప్ప అనుభూతిని కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సినీ గేయ రచయిత డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, సన్నివేశం కలిస్తేనే సినిమా పాట అవుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ కార్యదర్శి కె. ఆనందాచారి, ఉపాధ్యక్షుడు తంగిరాల చక్రవర్తి, కోశాధికారి మోహనకృష్ణ, నాయకులు పేర్ల రాము, గంగాధర్, విజయలక్ష్మి, వాహెద్‌ఖాన్, ఖాజామొయినుద్దీన్, సిరాశ్రీ, కార్తీకరాజు, బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రపంచ జ్ఞానానికి మార్గం

విద్య అనేది ఒక సామాజిక సాంస్కృతిక జీవన మార్గాన్ని రూపొందిస్తుంది. విద్య ప్రపంచ జ్ఞానానికి మార్గం. ప్రపంచాన్ని మనముందు ఆవిష్కరిస్తుంది విద్య. ప్రపంచ గమనాన్ని నిర్దేశిస్తుంది. మానవ జీవన సోపానమైన విద్య ప్రపంచ వ్యక్తిత్వాన్ని మనకు ఆవాహనం చేస్తుంది. విద్య మౌఖికంగానూ ఉంది. లిఖితమైది గానూ ఉంది. ఇపుడు లిఖిత విద్య ప్రపంచాన్ని నడిపిస్తుంది. విద్య అంటే ముందు తన్ను తాను తెలుసుకోవడం. తన్ను తాను తెలుసుకోలేని మనిషి చరిత్ర చెప్పే పాఠాలను నేర్వలేడు. విద్యకు ఏకాగ్రత దిక్సూచి. మనిషిని విద్యేతరమైన అంశాలు నిరంతరం వెంటాడుతూ వుంటాయి. వాటిని అధిగమించే శక్తినిచ్చేదే స్వీయ నియంత్రణ. నిజానికి మనిషి మేధో శక్తి అనితర సాధ్యమైనది. అది విన్నవి, కన్నవి తన మేధస్సుకు సమన్వయించి సముజ్వలం చేయగల శక్తిగలది. మానవుడు విద్యను స్వార్థానికి ఉపయోగిస్తున్న సందర్భంగా అది కార్పోరేట్ కబంధ హస్తాల్లోకి వెళ్ళింది. కార్పోరేట్ విద్యా వ్యవస్థ మెదడుకు వత్తిడిని కలిగించి, జ్ఞానాన్ని ధ్వంసించి పరిక్షోన్ముఖమైన దారి చూపుతుంది. ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్న వారు కొందరు తమ పిల్లల్ని కార్పొరేట్ విద్యలోకి నెట్టి జ్ఞానశూన్యమైన విద్యా సోపానాన్ని ఎక్కించాలని ప్రయత్నిస్తున్నారు. కార్పొరేట్ విద్యాలయాలకు అధిక ధనాన్ని విద్యార్జన కోసం వెచ్చిస్తున్నారు. నిజానికి జంతుజాలాలన్నింటి కంటే మానవుడే గొప్పవాడు. మానవ శరీరమూ, బుద్ధి అన్నీ శాస్త్రీయంగా రూపొందినప్పుడు మనిషిందుకు స్వార్థపూరితంగా తయారయ్యాడనేది ఇప్పుడు మనో శాస్త్రవేత్తల ముందున్న పెద్ద ప్రశ్న. అందుకే మానవుణ్ణి మనం నిరంతరం పునర్నిర్మించుకొంటూనే పోవాల్సి ఉంది. మానవుని బుద్ధిలోని స్వార్థం మానవ సమాజానికి హాని కలిగిస్తుంది. చివరకు తనకూ హాని కలిగిస్తుంది. మానవుల మధ్యలో అంతఃస్సంబంధాలను దెబ్బతీస్తుంది. మనిషి మౌఖిక సాంప్రదాయం నుంచి వచ్చిన వాడు. దళిత బహుజన మైనారిటీ విద్యను బోధనా పరిమ నుండి అందుకోవలసి ఉంటుంది. విద్యను ఒక జ్ఞాన స్రవంతిగా, వాస్తవ జీవన ప్రవాహంగా అభ్యసించినప్పుడే వాళ్ళు ప్రపంచ గమనంలోకి వెళ్లగలుగుతారు. దానికి భిన్నమైన కృత్రిమ విద్య వారు గ్రహించలేరు. అందుకే విద్యాంతరాలు ఏర్పడుతున్నాయి. విద్యలోకి కూడా మత, కుల వర్గబేధాలు జొరబడ్డాయి. నిజానికి ప్రకృతిలో ఉండే అనేక శక్తుల్ని మానవుడు బయటకు తీసాడు. వాటిని శాస్త్రాలుగా అభివృద్ధి చేశాడు. భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక శాస్త్రం ఇలా ఎన్నో శాస్త్రాలను అభివృద్ధి చేశారు. ఈ శాస్త్రాలతో అంతఃస్సంబంధమున్న బడుగువర్గాల విద్యార్థులకు ఇవి బాగా మెదడులోకి చొచ్చుకు వెళతాయి. అయితే ఇప్పుడు విద్యా బోధనలో నాణ్యత తీసుకురావడమే ముఖ్యమైన అంశం. కార్పొరేట్ విద్యాలయాల్లో ఉన్న వ్యాపార సంస్కృతిని ప్రభుత్వం నేరమైనదిగా గుర్తించాలి. అందులో ఆటస్థలాలు లేవు. లాబ్‌లు లేవు. ఎన్‌రోల్‌మెంట్ కూడా వేరే ప్రభుత్వ కాలేజీల్లో వాళ్ళు చేస్తున్న విషయం ప్రభుత్వం గుర్తించవలసి ఉంది. ప్రభుత్వ విద్య అభివృద్ధి చెందాలంటే ప్రపంచ భాషగా అభివృద్ధి చెందిన ఇంగ్లీష్ మాధ్యమ బోధన అనివార్యం. అంతమాత్రాన మాతృభాషను విస్మరించకూడదు. మాతృభాషలో జీవశక్తులు ఉంటాయి. ఆ జీవశక్తులను నేర్చుకునే భాషలోకి పరివర్తితం చేయగలగాలి. ఇంగ్లీష్ భాషని మనం నేర్చే క్రమంలో గృహాన్ని కూడా మోడ్రన్ స్ట్రక్చర్‌లోకి తీసుకు వెళ్ళాలి. విద్యార్థులకు ప్రత్యేకమైన గదులుండాలి. టేబుళ్లుండాలి. డిక్షనరీలు ఉండాలి. టేబుల్ మీద గ్లోబ్ ఉండాలి. "బైజూస్" లాంటి తగిన నూత్న పరికర ప్రాయోగిక అంశాలు గృహ వాతావరణం లేకుండా వర్ధిల్లవు. కానీ ప్రపంచ వేగాన్ని బట్టి, సమాజ పరిణామాన్ని బట్టి అవన్నీ అవసరం. తల్లిదండ్రుల్ని వయోజన విద్యాపరులుగా మార్చాలి. మరీ ముఖ్యంగా తాగుడుని పూర్తిగా నిర్మూలించకుండా గృహ సంస్కృతిలో విద్య వర్ధిల్లదు. టి.వి. సీరియల్స్ ప్రమాదకరంగా మారాయి. మధ్య తరగతి గృహిణుల గృహవాతావరణాన్ని విద్వేషపూరితంగా సీరియల్స్ ద్వారా మారుస్తున్నాం. దానివల్ల విద్యార్థులకు విద్యా వాతావరణం గృహాల్లో లేదు.

కార్పొరేట్ విద్యాశాలలు బలవంతమైన విద్యను బుద్ధి మీద రుద్దుతున్నాయి. దానివల్ల ప్రభుత్వ విద్యార్థులకు, కార్పొరేట్ విద్య నిర్దేశించే విద్యార్థులకు మధ్య తీవ్రమైన వైరుధ్యాన్ని ముందుకు తీసుకువచ్చేసింది. పిల్లల్లోకి గ్రంథాలయ సంస్కృతిని అలవాటు చెయ్యాలి. వంద తెలుగు పద్యాలు వచ్చిన వారికి త్వరగా ఇంగ్లీష్ వస్తుంది. ధారణ శక్తి అనేది మాతృభాషలోనే ప్రారంభమౌతుంది. మాతృభాష విద్యాశాలల్లో అదనంగా నేర్పాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా విద్యార్జనకు సంబంధించిన శారీరక శక్తి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థికి లేదు. హైస్కూళ్ళలో అసెంబ్లీ మొదలయ్యే సమయానికి విద్యార్థులకు రాగి బిస్కట్లు, కాల్సియం బిస్కట్లు, గ్లాసు పాలు ఇవ్వాల్సి ఉంది. దానిమ్మ, యాపిల్, బొప్పాయి, జామ వంటి పండ్లు ఉదయం 11 గంటలకు అందివ్వాల్సి ఉంది. విద్యార్థులు పోషకాహార లేమితో రక్తహీనతతో బాధపడుతున్నారు. లైన్ డేట్స్ జెల్ వారికి పాలలో కలిపి ఇవ్వాల్సి ఉంది. జీడి పప్పు, బాదం పప్పు, వేరుశనగ పప్పు వంటి బలవర్ధకమైన ఆహారాలు విద్యార్థులకు అందివ్వాల్సి ఉంది. ఇవన్నీ ఇప్పుడు ఇజ్రాయేల్, జర్మనీ, జపాన్,స్విట్జర్లాండ్, అమెరికా వంటి దేశాలలోని స్కూల్స్‌లో తప్పనిసరిగా అందిస్తున్నారు. మెదడుకు ఆహార శక్తి చాలా అవసరం. శారీరక శక్తి లేని విద్యార్థులు చివరి పీరియడ్ కల్లా బల్లమీద ఒరిగిపోతున్నారు. ప్రభుత్వ విద్య అంటే కేవలం అక్షరార్జన కాదని తెలుసుకోవాలి. విద్య అంటే అది జీవన సంస్కృతీ నిర్మాణం. మానవాభ్యుదయానికి అది సోపానం. ఈనాటి ప్రభుత్వ విద్యలో ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఎంత ముఖ్యమో సామాజిక వాతావరణ రూపకల్పన కూడా అంతే అవసరం. కార్పొరేట్ విద్యాలయాల్లో చదువుతున్న వారికి జీవితం తెలియడం లేదు. జీవించడం అంటే సమాజంతో జీవించడమే. మానవత్వంతో జీవించడమే. సుఖదుఃఖాలతో జీవించడమే. ఈర్ష్య, ద్వేషాన్ని ప్రక్కన పెట్టిన వారే అత్యున్నతమైన స్థానాలకు వెళ్తారు. ఈర్ష్య కల్గిన వారెవ్వరూ ఉన్నత స్థితికి రాలేరు. ప్రపంచ వ్యాప్తంగా విద్య పెరుగుతుంది. విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయి. భాషాధ్యాయనమే ఒక ఉపాధిగా కూడా పెరుగుతుంది. వరల్డ్ బ్యాంక్, యూ.ఎన్.ఓ, యునెస్కో, డబ్ల్యుహెచ్ఓ, యునిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థల్లో లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్స్ అవసరం ఉంటుంది. ఇప్పుడు ఒక్క ఇంగ్లీషే కాదు, చైనీస్, జర్మని, ఫ్రెంచ్, రష్యన్ వంటి అన్ని భాషలూ నేర్చుకోవాల్సిన అవసరం ముందుకొచ్చింది. ప్రభుత్వం విద్యార్థి శారీరక, మానసిక శక్తిని, కుటుంబ శక్తిని పెంచే క్రమంలో భాషలు అలవడతాయి. భాషలతో పాటు శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, సాహిత్యం, కవిత్వం వంటి అనేక కళలు, క్రీడల సామర్థ్యం, సాంకేతిక విద్యలు ఈనాడు బహుముఖంగా విద్యార్థులు అభ్యసించవలసిన చారిత్రక దృక్పథం అవసరమైంది. అందుకే ప్రభుత్వం – ప్రజలు మమేకంగా విద్యా సాంస్కృతిక వికాసానికి కుల,మత రహిత జీవన విధాన అభ్యసనానికి, ఆచరణకు, భారత రాజ్యాంగ స్ఫూర్తికి, డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధ్యంతో ముందడుగు వేయవలసిన చారిత్రక సందర్భమిది.

> కార్పొరేట్ విద్యాలయాల్లో చదువుతున్న వారికి జీవితం తెలియడం లేదు. జీవించడం అంటే సమాజంతో జీవించడమే. మానవత్వంతో జీవించడమే.

–డా॥ కత్తి పద్మారావు
9849741695

సాహితీ లోకంలో నిండు చంద్రుడు సినారె

'సినారె సినీ గీతాల సౌరభం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్.

తెలుగు సాహితీ లోకంలో నిండు చంద్రుడిగా వెలిగిన విశ్వమానవుడు డా॥సి. నారాయణరెడ్డి అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కీర్తించారు. మంగళవారం లావణ్య ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలో కె. ప్రభాకర్ రచించిన 'సినారె సినీ గీతాల సౌరభం' పుస్తకావిష్కరణ సభ జరిగింది. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ టి. గౌరీశంకర్, విశ్రాంత ఆచార్యులు డా॥ ఎస్వీ రామారావు సినారె కావ్యాలు గుర్తు చేశారు. చీకోలు సుందరయ్య, కవి రఘుశ్రీ పాల్గొన్నారు.



స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి స్త్రీల సామాజిక పరిస్థితులు - వారి సాహిత్యం

సమాజంలో చోటుచేసుకుంటున్న సంస్కరణల వల్ల, స్త్రీ విద్యా వ్యాప్తి వల్ల చైతన్య మనస్కులైన స్త్రీలు, భారత స్వాతంత్ర్య సమర శంఖారావాన్ని పూరించిన గాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణోద్యమంలో, సత్యాగ్రహ ఉద్యమాలలో వందలు, వేలుగా పాల్గొని తొలిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఇలా రావడం అన్నది స్త్రీలకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని కలిగించింది. 1916లో హోమ్‌రూల్ ఉద్యమానికి అనీబిసెంట్ (ఐరిష్ మహిళ) నాయకత్వం వహించింది. 1919లో మాంటెన్ ఛెమ్స్‌ఫర్డ్ కమీషన్‌కు స్త్రీల ఓటింగ్ హక్కు గురించి విజ్ఞాపన పత్రాన్ని కజిన్స్ సతి, సరోజినీ నాయుడు కలిసి సమర్పించారు. 1920లో శాసన సభకు స్త్రీలు పోటీ చేయడానికి ఆమోదాన్ని పొందారు. మద్రాసు శాసన సభకు తొలి మహిళా సభ్యురాలిగా శ్రీమతి ముత్తు లక్ష్మీ రెడ్డి ఎన్నికయ్యారు. 1927లో సైమన్ కమీషన్ స్త్రీలకు 2:1, పురుషులు, స్త్రీల నిష్పత్తిలో ఓటింగ్ హక్కు ఇవ్వడం జరిగింది. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, భారతదేశమంతటా ఉవ్వెత్తున కల్లోలం రేపుతున్న తరుణంలో ఆంధ్ర మహిళా చైతన్యం వెల్లివిరిసింది. దేశంలోని ఇతర ప్రాంతాలలోని మహిళల సమాధికారోత్సాహం, స్వాతంత్ర్య నిరతి, త్యాగశీలత... ఇవన్నీ తెలుగు మహిళలపై కూడా ప్రభావాన్ని చూపాయి.

1921లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఆ సమయంలో మహాత్మా గాంధీ ఆంధ్ర దేశంలో పర్యటించారు. వారి ఉపన్యాసాలకు గుమ్మిడిదల దుర్గాబాయమ్మ గారు భావస్ఫోరకమైన తెలుగు అనువాదాన్ని చేసి మహాత్ముని ప్రశంసలు అందుకున్నారు. ఉత్తేజితురాలైన తెలుగు వనితలు అత్యంత త్యాగ నిరతితో తమ ఒంటిమీద నగలు వలచి, ఆనందంగా స్వరాజ్య నిధికి విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన మహిళలు 1. మాగంటి అన్నపూర్ణమ్మ, 2. యలమంచిలి తాయారమ్మలు. సహాయ నిరాకరణోద్యమానికై తన నగలన్నింటినీ గాంధీజీకి అర్పించిన తొలి మహిళ మాగంటి అన్నపూర్ణా దేవి. భర్తతో పాటు ఉన్నత విద్యాభ్యాసానికై అమెరికా వెళ్లబోతున్న సమయంలో గాంధీజీ పిలుపు వల్ల ప్రభావితురాలై దేశ స్వాతంత్ర్య సాధనకు తన జీవితాన్ని అంకితం చేసింది. "నాకు జ్ఞాపకమున్నంత వరకు తనకు ఉన్న బంగారు నగలన్నింటినీ నాకు సమర్పించిన ప్రథమ మహిళ ఈవెయే'' [-1] అని బాపూజీ ప్రశంసలందుకుంది.

"సభ్యత కలది సంఘము. కళ్యాణ గుణవత్త్వము సభ్యత. అట్టి సభ్యతగల సంఘానుభూతి సాహిత్య విషయము... కానీ... మహిళలకి యవకాశమేది? అసూర్యంపశ్యలై అంత:పురమేలు అంగనల బుద్ధి ప్రాభవములను అవని రాజ్యాంతరములనే అవధులుగా చేసుకొని రాజ్యమేలినవి.... కలి కుమారులు స్వస్తి వాక్యములు బలుకుచు ముందు నడువ, సారస్వత స్వర్ణ రథమెక్కి వాడవాడలా విజయోత్సవము వెడలినను తెలుగు వారికి నీరాజనమెత్తుటకును తీరక లేకపోయినది'' [-2] అంటూరు లక్ష్మీ కాంతమ్మ గారు. సంఘానుభూతి కొరవడిన మహిళలు పురుషులతో ధీటుగా గ్రంథాలు వెలువరించలేకపోయారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో సంప్రదాయ కవిత్వం, భావ కవిత్వం విరివిగా వనితలు వెలువరించినా నవలా ప్రక్రియ చేపట్టిన వారు అతి కొద్ది మంది.

> స్త్రీలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే రచనలు, వాటికి పరిష్కారాలను సూచించగలిగిన సాహిత్యం సమాజంలోనికి ప్రవహించి మానసికంగా పరివర్తన తీసుకొచ్చినపుడే స్త్రీల సమస్యలు కొంత వరకైనా సమసి పోవడమన్నది జరుగుతుంది.

మొట్టమొదటిసారి కృపాబాయి సత్యనాధమ్మగారు 'కమలాంబ' అనే ఆంగ్లానువాద గ్రంథాన్ని వెలువరించారు(1909). తదుపరి 'రూపవతి' అనే చారిత్రాత్మక నవలను శ్రీమతి అట్లూరి వెంకట సీతమ్మ గారు రచించారు (క్రీ.శ.1918). 'ఉత్తర దేశపు గాథను జేపట్టుటచే నా వాతావరణ చిత్రణమనివార్యము. కానీ మన నవలాకర్త పాత్రల పేర్లు మున్నగు అప్రధాన విషయములను దప్ప ప్రధాన విషయముల యందు ఔత్తరహచార్య వ్యవహారములను స్ఫురింపజేయ జాలలేదు'' [-3] అని డా॥ బొడ్డపాటి కుటుంబరావు గారు ఈ నవలను కొనియాడారు.

తరువాత చెప్పుకోదగిన రచయిత్రి శ్రీపులుగుర్తి లక్ష్మీ నరసమాంబ గారు. ఈమె వీరేశలింగ యుగమున వర్ధిల్లిన కవయిత్రి. వీరేశంలింగం గారి ప్రతికక్షి అయిన కాశీభట్ల బ్రహ్మయ్య గారి శిష్యురాలు. 'సావిత్రి' పత్రికా సంపాదకురాలు. సంఘ సంస్కరణలలో వీరేశలింగం గారికి వ్యతిరేకంగా ఉన్నా, స్త్రీ విద్యా ప్రచారంలో సేవచేసి, ఆంధ్ర దేశంలో ప్రథమ స్త్రీ సమాజం 'విద్యార్థినీ' సమాజాన్ని కాకినాడలో స్థాపించారు. 1904లో 'సావిత్రి' పత్రికను స్థాపించి సమర్థతో నడిపారు. బంకించంద్రుడి వంగ నవల 'యోగేశ్వరి'ని దామోదర ముఖ్యోపాధ్యాయుని 'అన్నపూర్ణ' నవలను తెలుగులోకి అనువాదం చేశారు.

సీరమ సుభద్రయాంబ గారు 'జాగిలము' అనే ఫ్రెంచి నవలను తెలుగులోకి అనువదించారు. కవి తిలక శ్రీమతి పులవర్తి కమలాదేవి గారు 'కుముద్వతీ' అనే చారిత్రక నవలను వ్రాశారు. ఇది పాఠ్య గ్రంథంగా నిర్ణయించబడింది.

దేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖంగా పాల్గొన్న ఆంధ్ర మహిళ మాగంటి అన్నపూర్ణమ్మ త్యాగనిరతి, అకుంఠిత దేశభక్తి గలది. అన్నపూర్ణమ్మ భర్తకు తాను స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాగ్నిలో సమిధ కానున్న ఆశయాన్ని తెలుపుతూ వ్రాసిన లేఖాంశాలను సయితం, ఇందిర & భారతీ దేవి సోదరీమణులు కవిత్వ రూపంలో 'అన్నపూర్ణా సుభాషిత రత్నావళి' పేరిట వెలువరించారు. ఈ సోదరీమణులు 'ప్రతిమాదేవి' అన్న చారిత్రాత్మక నవలను వ్రాశారు. తణిగొండ వెంగమాంబకు తదుపరి ఏబది వర్షములు సారస్వత రంగమున అంధకారం ఆవహించినదని పేర్కొనవచ్చు. [-5]

వీరేశలింగం పంతులు గారు చేసిన స్త్రీ విద్యా ప్రచారము వలన బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించిన శిష్యురాళ్లలో శ్రీమతి కొటికెలపూడి సీతమ్మ కావ్య రచనకు శ్రీకారం చుట్టారు. వీరి కుమార్తె శ్రీమతి చంద్రమతి. 1948లక్ష 'సరళా ప్రభావము' & 'హిందు గృహము' నవల వ్రాసి తల్లికి అంకితం చేశారు. సంపన్న గృహాలు, ఎగువ మధ్య తరగతి కుటుంబాలలో స్త్రీల దినచర్య, ఆచార వ్యవహారాలు, స్థితిగతులు అన్నీ దీనిలో వివరించారు.

స్త్రీలకు సరైన విద్య, పని ఒత్తిడి, కుటుంబ అవసరాలు తీర్చడంలో .... తీరిక ఎక్కువ లభించడం వల్ల ఇటువంటి అవాంఛితమైన దుష్ట సంస్కారం ఎక్కువ అవుతుంది అని అభిప్రాయం. 'హిందు గృహం' నవలలో రచయిత్రి ఆనాటి బాలికల, స్త్రీల సాంఘిక పరిస్థితులను చాలా వరకు ఉటంకించారు. రచయిత్రి తన భావాలను చాలా సందర్భాలలో పాత్రల ద్వారా కాకుండా నేరుగా చెప్పి, సంప్రదాయాలకు పెద్ద పీట వేశారు.

గురించి బాపిరాజు గారు 'తుఫాను' నవలలో... శ్రీమతులు రత్నాల కృష్ణాబాయమ్మ గారు, కమలాదేశి గారు, దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ గారు, దామెర్ల సత్యవాణి గారు, సీతా కుమారి గారు, జంగం లక్ష్మీబాయమ్మ గారు మొ॥ చిత్ర లేఖనంలో ప్రాశస్త్యం వహించిన మహిళలను పేర్కొన్నారు. ఆనాడు వివిధ రంగాలలో ప్రాశస్త్యం వహించిన స్త్రీల గురించిన ప్రశస్తి ఉండి దుర్గాబాయమ్మ గారు ఉపన్యసించినట్లు వ్రాసారు. [-6]

"మహిళోద్యమం, మహిళా సభ స్ఫూర్తితో దేశమంతటా స్త్రీలకు క్లబ్బులు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, సేవా సంఘాలు ఏర్పాటు కావడం జరిగింది. దేశ సేవను స్త్రీలు, పురుషులతో పాటు చేస్తున్నారని, పవిత్ర స్త్రీల ఆశ్రమాలు ముత్త లక్ష్మీ రెడ్డి, యామినీ పూర్ణ ఫలితంగా నేడు భారత దేశంలో స్త్రీలకు ఓటు, శాసన సభా సభ్యత్వము, మంత్రిత్వము, చదువు, ఉద్యోగాలు, న్యాయవాదిని, వైద్యురాలు, ఉపాధ్యాయిని మొదలయిన వృత్తులెన్నియో లభిస్తున్నాయి. ఈ కృషి ఫలితంగానే శారదా శాసనం వచ్చింది. అందువల్ల దేశంలో ఎంతో మార్పు కలిగిందని, స్త్రీలకు ఆస్తి, బహు భార్యత్వ నిషేధము, విడాకుల వాయ్యము రాగలవని, తామందరూ కొంత ప్రయత్నం చేసింది, నాంది మాత్రమేనని, ఇంకా కొన్ని వేల రెట్ల ఉత్సాహంతో స్త్రీలందరూ నడుం కట్టుకొని ప్రయత్నం చేయాలనీ, అప్పుడుకానీ స్త్రీ ఆశయాలు నెరవేరవనీ చెబుతారు".

సామాజిక పరిస్థితులలో అనేక మార్పులు సంభవించినా యువతి అడుగడుగునా సమస్యలనే ఎదుర్కొంటోంది. సమస్యలే జీవితంగా జీవిస్తుంది. అణచివేతను ఎదుర్కొంటుంది. దాన్ని అధిగమించడానికి సమస్యల మూలాల్ని తెలుసుకోవడానికి, పరిష్కారాలను సాధించడానికి సాహిత్య పరంగా, సమాజ పరంగా కృషి జరగాలి. స్త్రీలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే రచనలు, వాటికి పరిష్కారాలను సూచించగలిగిన సాహిత్యం సమాజంలోనికి ప్రవహించి మానసికంగా పరివర్తన తీసుకొచ్చినపుడే స్త్రీల సమస్యలు కొంత వరకైనా సమసి పోవడమన్నది జరుగుతుంది.

–డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

ఎఫ్ఆర్‌వో శ్రీనివాసరావుకు నివాళులర్పించిన మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ

ఖమ్మం, నవంబర్ 23: (నేటినిజం ప్రతినిధి): : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తికోయల దాడిలో మృతిచెందిన ఫారెస్టు రేంజ్ అధికారి (ఎఫ్ఆర్‌వో) శ్రీనివాసరావు పార్థివదేహానికి మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాధికారులపై దాడులను ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. శ్రీనివాసరావుపై దాడికి పాల్పడి హత్యచేసిన వారిని తప్పక శిక్షిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఈ ఘటను చాలా సీరియస్‌గా తీసుకుందన్నారు.

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, ఇతర బెనిఫిట్స్ కల్పిస్తూ జీవో విడుదల చేసిందన్నారు. ఇక్కడి గిరిజనులతో సమస్య లేదని, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన గుత్తికోయలు అడవులను విచక్షణా రహితంగా నరికివేస్తున్నారని చెప్పారు. అడవులను నరికినట్లు తమ అధికారులను కూడా నర్కుతం, దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు.

ఎఫ్ఆర్‌వో అంత్యక్రియలను ఖమ్మం జిల్లా ఈర్లపుడిలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహిస్తున్నారు. మంత్రులు పువ్వాడ అజయ్, ఇంద్రకరణ్ రెడ్డి.. శ్రీనివాసరావు పాడెపట్టి ముందు నడిచారు.

మంత్రుల వెంట రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే రెగా కాంతారావు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, సీఎం ఓఎస్డి ప్రియాంక వర్గీస్,అటవీ శాఖ స్ప

సాహితీ కెరటాలు

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 24-11-2022

కొన్ని క్షణాలు

ద్వారబంధం ఆనుకుని
అలా నిలబడి పోయినట్టు
కొన్ని క్షణాలు స్థబ్దతలో
రెప్పవాల్చకుండా తేలి
పరిసరాలు పీల్చుకు ఊరుతుంటాయి.

నిద్రపోతున్న నదిలానే అనిపిస్తుంది
ఒక్క అలకూడా పొటమరించని
ఉపరితలాన్ని చూస్తే
లోలోపలి ఎన్ని మౌన సంభాషణలో
ఉవ్వెత్తున ఎగసిపడి
తలలు బాదుకునే ఎన్ని సముద్రపుటలలో
మూసిన కనురెప్పల గోడలకే గా తెలిసేది.

ఆర్ద్రమై ప్రవహించే జలపాతాల ఉనికి తెలియక
వెచ్చని ఊపిరిలో సడి చెయ్యని నరాల మెలికల్లో
గుండె వినిపించే అవిశ్రాంత లయలో
ఏం కావాలో తెలియక ప్రతిలిప్తలోనూ వెతుక్కునే నీ
చుట్టూ చుట్టూ మూగుతూ ఉంటాయి
అలిగి ఏమూలో ఒదిగిన అక్షరాల పసికూనలు .

ఉదయమే మొదలు అక్షరాల రాళ్ళను ముందేసుకు
లోలోపలి ఆర్తి ఉలిగా చెక్కుతూ పోడం
మాటలు మౌన సముద్రాలయినా
రెక్కలు విదుల్చుకుని కొత్తగా ఎగిరే శ్వేత కపోతాలైనా
పురివిప్పిన నాట్య మయూరాలైనా
చివరకు ఘనీభవించిన కన్నీటి బండరాళ్ళు అయినా
శిల్పాలై రూపు దిద్దుకుంటూనే
గాలి తాకిడికే సోమ్మసిల్లే పూబాలలు నా మాటలు.

అందుకేగా
నన్ను పూర్తిగా దోచుకుని
దాచుకున్న
నా అక్షరాలకు అణువణువూ
పరచిన తివాసీయే
అన్ని క్షణాలూ
ఆదమరచిన నదులే

-స్వాతీ శ్రీపాద
8297248988

బేల మనసు

తటిల్లతలా మెరిసిన ఓ భావన
మరుక్షణం విస్మృతమైపోతే
తిరునాళ్లలో
బిడ్డ తప్పిపోయినంత వ్యథ

గగన భిత్తికపై మేఘం మెరిపించిన
అద్భుత రేఖాచిత్రం
ఎన్ని వానకారుల్లో ఎదురు చూసినా
మళ్ళీ అలాగే కనిపించదు.
ఏమో...
చినుకు గుండెలో ఒదిగి ఉందేమో!
వానని వడకట్టి అన్వేషించాలి
ఏ అనుభూతినీ వదులుకోకూడదుగదా!

నిదురలేని రాత్రుల్లో మనసు
అప్పుడప్పుడు
స్మృతుల అగాధాల్లోకి దూకేస్తుంది
ఆత్మహత్యలా భయపెట్టినా
అది ఆత్మాన్వేషణే...
మనసుదేముంది.. పాపం పిచ్చిది!
దిశలేని ప్రవాహిని
వాన కురిస్తే ఇంద్రధనుస్సు రంగులన్నీ
కారిపోతాయేమో అనుకోవడం
దాని ఫోబియా
అర్ధరాత్రి ఇంద్రధనుస్సు
విరియాలనుకోవడం
ఓ మానియా!

- డా॥వై.రామ కృష్ణారావు
8985743964

డా.నందమూరి లక్ష్మీపార్వతి, ఆంధ్రప్రదేశ్ తెలుగు & సంస్కృత అకాడమీ చైర్మన్ గారి చేతుల మీదుగా నిశ్శబ్దస్వప్నం కవితాసంపుటి ఆవిష్కరణ ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం, విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమంలో శామ్యూల్ జోనాధన్-ఆర్టీఐ కమిషనర్, బొప్పరాజు వెంకటేశ్వర్లు-ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు, కళారత్న బిక్కి కృష్ణ, డా.జెల్లి విద్యాధర రావు, కలిమిశ్రీ-నవమల్లెతీగ సంపాదకులు ఆర్.ఆర్.గాంధీనాగరాజన్-గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్, శ్రీ చిన్ని నారాయణరావు, సాగర్ రామకవచం, శ్రీ మేడిది వెంకటేశ్వరరావు, శ్రీ రామక్రిష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుభవాలసారం నానమ్మ చెప్పిన కథలు



కథా సాహిత్య తెలుగునాట రెండు షష్టిపూర్తులు చేసుకొంది. కవిగా, సంపాదకుడిగా, కథా రచయితగా, కూర చిదంబరం తెలుగు పాఠ కులకు సుపరిచితులు. గ్రంథ సమీక్షకునిగా, విమర్శకునిగా, ప్రశిద్ధులైన కూర చిదంబరంగారి తాజా కథల సంపుటి ఇది. నేషనల్ బుక్ ట్రస్ట్ సంపాదకులైన డా॥ పత్తిపాక మోహన్ చక్కటి ముందు మాట రాసారు.

ఆరుబయట అమ్మమ్మలు- నాన్నమ్మలు- పిల్లలకు చెప్పే నీతి కథలు- చందమామ కథల్లానే కూర చిదంబరంగారి కథలున్నాయి. 31 రోజులూ హాయిగా పిల్లలకు చెప్పాల్సిన మంచి కథలివి **నీతి- సందేశం- ఆత్మ విశ్వాసం కలిగించే కథల్లో కష్టేఫలి- చెడ్డవారి స్నేహం- కృతజ్ఞత తృప్తి- ఉపాయం- ఓపిక- రక్షణ** కథలు పేర్కొనవచ్చు. **"మోసం చెయ్యవద్దు"** (పే.13) కథలో అనారోగ్యం తగ్గిస్తే దేవునికి గుడి కట్టిస్తానన్న పరంధామయ్య మ్రొక్కి- తరువాత **'బొమ్మగుడి'** మాత్రమే కొని దేవునికి నివేదించాడు. కలలో దేవుడు మరో పొలం కొనమని చెప్పి లంకె బిందెలుంటాయని చెప్పగా.. ఆశించి నంత ధనం దొరకదు. లంకె బిందెలు చిన్నవి వుంటాయి. మోసగించాలని చూస్తే ఆశాభంగం ఎదురు అవుతుంది అని చెప్పేకథ.

పిల్లలు అంతా సమానమే ఎవరి గొప్ప వారిదే అని చెప్పే మంచి కథ " ఎవరి గొప్ప వారిదే" (పే.26) ఒక మిద్దె తోటలో వున్న గులాబీ- పాలకూర కుండిల్లోని మొక్కలు వారి వారి గొప్పతనం ఒకర్నొకరు ప్రశంసించుకొంటాయి. ఎవరి గొప్ప వారిదే అంతా సమానమే అన్నసత్యం తులసి మొక్క చెబుతుంది. (పే.26)

"చెప్పే ముందు చేసి చూపాలి" (పే.28) కథలో **పెద్ద పీత- చిన్న పీతను** చక్కగా నడవాలి అని చెబుతుంది. అప్పుడు చిన్నపీత ఎలా నడవాలో నువ్వు చూపకుంటే- ఆ పీత తన్నగ్గా నడవలేక వంకర టింకరగా నడుస్తుంది. మనం ఎప్పుడూ ఇలానే నడుస్తాం. ఇది మన తీరు అంటూ..! చెప్పే ముందు చేసి చూపాలి' అనే సత్యం యీ కథలో పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. కొన్నికథలు చిన్నచిన్న స్కిట్స్‌గా పాఠశాలలో (నాటక రూపంలో) ప్రదర్శిస్తే ఎంతో ప్రయోజనకరం కూడా!

ఈనాడు వాట్సప్‌లు- సెల్‌ఫోన్లు- యూట్యూబ్‌ల్లో తల దూర్చే పిల్లలకు 1,2,పేజీల్లో చక్కటి నీతి మంచి నడవడిక రేపటి తరానికి అందించే గొప్ప మినీ కథల సమాహారం ఇది. మా లాంటివారు మా చిన్నప్పుడు చందమామ, బాలమిత్ర మాసపత్రికల్లో ఏ కథ చిన్నగా వుందో ముందుగా చూసి.. ఆ కథే ఇంట్రస్ట్‌గా గలగల చదివేవారు. ఈ సంపుటిలోని చాలా కథలు చిన్నవే. హాయిగా పిల్లలు పెద్దలూ చదవచ్చు. కష్టపడి సంపాదించాలి. సోమరులుగా ఉండరాదు అనే నీతిని సోమరిపోతులకు కొరడా దెబ్బలతో ధనికుడు ఎలా బుద్ధి చెప్పాడో చెప్పిన కథ **"సోమరితనం వద్దు"** (పే.41). నేటితరం యువత స్వేచ్ఛ హాయిగా బైట తిరగాలి అనే కోర్కెను పెద్దలతో కోరతారు- ఆ అంశంపై రాసిన మంచికథ **"పెద్ద వారిమాట వినాలి"** (పేజీ.52) పంజరంలోని వారు చిలుక పిల్ల బైటకు స్వేచ్ఛగా వెళ్ళాలని పట్టుబట్టి ఆహారం కూడా తినకపోవడంతో యజమాని వదలి వేస్తాడు. బయటకెళ్ళి కష్టాలు పడి చివరకు గద్దకు ఆహారం అవుతుంది. పిల్లలూ అంతే కదా!! చక్కటి నీతి కథలు అందించిన చిదంబరంగారికి అభినందనలు.

మరిన్ని పిల్లల కథలు రాయాలి.

ప్రతులకు: నవచేతన బుక్‌హౌస్ 4-1-435, బ్యాంక్ స్ట్రీట్ హైదరాబాద్-01.

-కె.వి.ఎల్.ఎల్. ప్రసన్నకుమారి
సెల్: 9492430137

లలితగీతం-కవిత్వం-పద్యం 'త్రీ-ఇన్-ఒన్'



"నేను ఇంజనీరును
విద్యుదింజనీరును
పరిశ్రమల ప్రాణమునై
జీవన సోపానమునై
ప్రగతికి రథసారథినై
వెలుగు ఇంజనీరును
విద్యుదింజనీరును"

అంటు తనను తాను పరిచయం చేసుకుం టున్న వల్లభుని నిర్మలప్రసాద్ వెలువరించిన తొలి కవితా సంపుటి 'వెన్నెలసుమ మాలికలు'. విద్యుత్ ఇంజనీరుగా పదవి విరమణ చేసిన నిర్మల ప్రసాద్ 80 సం॥ల వయస్సు లో చేస్తున్న తొలి ప్రయత్నం యిది. కలం పేరు 'నిర్మల్, కవన రంగంలోకి అడుగిడటానికి వయస్సు అడ్డంకి కాదనీ, యిన్నేళ్ళుగా అణిగి వున్న, ఉత్సాహ, ఉద్వేగాలు జీవితానుభ వంతో పెనవేసుకుని ఒక్కసారిగా పెల్లుబికిన పరిణతి యిదనీ ఈ కవి రచనలు చదివితే అర్థం అవుతుంది. వీరి తండ్రిగారు ఆటవెలది ఛందస్సులో శతకాలు రచించి **'అపరవేమన'**గా వినుతికె క్కారు. బహుశా: నిర్మల్ మూలాలు అక్కడ వుండొచ్చు. తెలుగు భాషపట్ల మక్కువ పెంచుకుని తేటగీతి పద్యాలు చాలానే పొందుపరిచారు. లలిత గీతాలు, కవితలు, పద్యాలు కలబోసిన 'త్రీ-ఇన్-వన్' సంపుటి యిది.

"మానవాళికి జీవమౌ మగువనీవు
ఇంటిలో దీపమై వెల్గు ఇంతినీవు!
భార సంసార సారథీ! భాగ్యలక్ష్మీ!
పట్టుకొమ్మవు పురుషుని బ్రతుకు సందు.."

త్రీ పట్ల కవి అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ అల్లిన తేటగీతి పద్యం యిది. యిలాంటి హూందాగా రాసిన పద్యాలే కాదు.. ప్రేయసిని కలవరిస్తు, అణువణువూ అక్షరంతో స్పృశించిన చిలిపి కవితలూ లేకపోలేదు.

"తుమ్మెదనై తీయనినీ
పెదవులు స్పృశించుదునా-
తెమ్మెరనై అల్లిన
పయ్యెద సవరించుదునా-
ఓ గులాబీ చిన్నదాన!!"

మచ్చుక్కి యిదొక్కటి. కవి నిర్మల్ భావుకుడు. దృశ్యాన్ని అనుభూతించ డమేగాదు కవిత్వీకరించగలడు. కోనసీమ అందాలకు ముగ్ధుడైన కవి.

"ఒంకీల వంతెనను
ఒద్దాణముగా ధరించి
రైలు-రోడ్డు వారధిని
రత్నహారముగ దాలిచి
రాజమహేంద్ర పుర ప్రజలకు
సాక్షాత్కరించె గోదావరి"

అంటు గోదావరి అందాలను దృశ్యమానం చేస్తాడు.

జుట్టు లేకపోవడం.. బోడి గుండుగా మిగిలిపోవడం భలే హాయిగా, సౌ కర్యంగా వుంటుందని ఓ హాస్య కవిత ను చిలిపిగా వినిపిస్తాడు.

జరిగిపోయిన కాలంలో కూరుకుపోవద్దు. వర్తమానంలో ఆగిపోవద్దు.. భవిష్యత్తు గురించి బంగారు కలలు కంటు జీవితాన్ని, బంగారు మయం చేసుకొమ్మని యువతకు ప్రబోధాత్మక కవితలను అందించాడు. **"ఎవరివే చినదాన!"** వంటి లలిత గీతాలు బాణీలు కట్టి పాడుకోవడానికి అనువుగా వున్నాయి.

నిర్మల్ మొదటి సంపుటితో ఆగిపోలేదు. కవన రంగంలో వడివడిగా అడుగులేస్తు రవీంద్రనాథ్ ఠాగూర్ 'Stray Birds' కవితల అనువాదం **'భావ విహంగాలు'** పేరిట.. రెక్కలు ప్రక్రియలో **'ముత్యాల మెరుపులు'** శీర్షికన.. ఆట వెలది ఛందస్సులో **'నిర్మలాత్మక శతకం'** అనే శతక గ్రంథం ప్రకటించారు. ఈ గ్రంథాల న్నింటిపైన నేను సమీక్షలు రాసినట్టు గుర్తు.

సృజనాసక్తిని యిలాగే ఒడిసిపట్టి మున్ముందు మరింత పరిణతితో కవిత్వశక్తికి పదును పెట్టుకుంటూ నిర్మల్ తన సాహిత్య ప్రస్థానం కొనసాగిస్తాడని ఆశించవచ్చు.

ప్రతులకు: వల్లభూని నిర్మలప్రసాద్
డో.నెం. 82-7-6/7,
ఫ్లాట్ నెం.ఎన్2 చక్రవర్తి శ్రీ నిలయం
అపార్టుమెంట్స్ స్ట్రీట్ నెం.3, విద్యుత్ కాలనీ
ఎ.వి. అప్పారావు రోడ్
రాజమహేంద్రవరం-533 106
సెల్: 9515437012

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

పుస్తక సమీక్షలు

సౌందర్య మంజూష ఈ "అంతరంగపు భాష"



సమాజం స్పందించే ప్రపంచానికై నిశ్శబ్దంగా, ఏకాంతంగా ఎదురు చూస్తుంది. ఒక పిలుపు, ఒక అరుపు, ఒక మాట మనిషి గతి శక్తిలో చలన రూపాలుగా మారి, కాలం ఎప్పుడైదే ఘనమవుతుందో, కిరణం ఎప్పుడైతే కనుమరుగవుతుందో అప్పుడే అక్షర సాక్షిగా చీకటితో యుద్ధం అనివార్యం. అశాంతిలో ఆవేదన తప్పదు. శూన్యంలో ముంచి తీసిన సమాజ ముఖచిత్రంపై తగులుతున్న గాయాలు గీసిన శిఖలు కొన్ని ఆణిముత్యాలై కాలం చేసిన సంతకం లా నిరంతరం పాఠకుల్ని, సాహితీ అభిమానుల్ని ఉత్తేజానికి గురిచేస్తాయి కదా అనిపిస్తుంది కవి జల్దీ విద్యాధర్ రావు గారి కవిత్వం చదువుతు న్నప్పుడు. ఒక ఆలోచన ఆవేశంగా మారినప్పుడు, ఒక ఆవేదన అంతర్లీనం గా మౌనమై ప్రవహించినపుడు, ఒక నిలదీత నిరంతరాయంగా వేధించి నప్పుడు, ఒక ఆకృతి అలంకారప్రా యంగా హృదయానికి హత్తుకున్నప్పుడు బయటపడిన ఆణిముత్యాలు వీరి కవితలు. వీరి కవితల్లో ఆత్మాశయ రీతి, వస్తు నవ్యత, భావ నవ్యత, శైలీ నవ్యత, అభివ్యక్తీకరణలో నవ్యత కలగలిపిన అమృత ధారలా ప్రవహించిన బిందువులివి. ఎందుకంటే నేటి కవితలన్నీ వస్తుప్రదానమైనవి మనం చదువుతున్నాం. చాలా చోట్ల వ్యక్తి ప్రాతినిధ్యపు కవిత్వం చదువుతున్నాం. మాండలికపు ప్రదానమైన కవిత్వాలు అనేకం చదువుతున్నాం. కానీ కవిత్వంలో సౌందర్యం, సార్వజనీనత, పరిమళం అనే మూడు ప్రధానాంశాలు అనేక చోట్ల మనం కోల్పోతున్నాం. ఆ అంశాల్లో మొదటి రెండు అంశాలు విద్యాధర్ గారి కవితల్లో అంతర్లీనంగా దర్శనం ఇస్తాయి అనే విషయం తరచి చదివితే అందరికీ అర్థమవుతుంది. అంతరంగపు భాషలో అంతర్లీనంగా మనకు కనిపించే పద చిత్రణలు మనల్ని మరింతగా చదివిస్తాయి.

ప్రాచీన కవులు తమ పద్య కవిత్వాన్ని వర్ణనతోనే ప్రారంభించారు. ప్రకృతి, ఒక రాణి, అంత:పురపు సౌందర్యం, రాజు పరిపాలనా విధానం, ఆ రాజులోని గొప్ప ఔదార్యం వంటివన్నీ పద్య కవిత్వాలై అలరించాయి. ఆఖరికి రాజు తన ఆస్థానంలోకి రాగానే ఒక కవి తన గురించి, తన రాజ్యం గురించి నాలుగు పాదాలైనా వినకపోతే వారు తమ తమ ఆసనంలో ఆసీనులయ్యే వారు కారని మనకు తెలియనిది కాదు. అంటే మనకు అర్థమయ్యేది ఏమిటంటే కవిత్వమంటే మొదటి సమాధానం సౌందర్యం. అలాగని సౌందర్యం మాత్రమే కవిత్వమా? అవును. అనే చెప్పాలి. ఏ విషయమైనా, ఏ సంఘటన అయినా, సమాజంలో ఎలాంటి వివత్తయినా, తీవ్ర పరిణామమైనా ఆ వ్యక్తీకరణలో ఆవేశం ఉండచ్చు, ఆవేదన ఉండచ్చు, ప్రశ్న ఉండచ్చు.. కానీ పద సౌందర్యం ఉండి తీరాలనే విషయం ఈ కవికి తెలిసింది. మనిషికి అంతరంగానికి మించిన గురువు లేదు. ఆత్మాశ్రయాన్ని మించిన ఆసనం లేదు. తొలుత వీరు తమ కవిత్వాన్ని గురువు నుండి మొదలుపెట్టడం ఒక సమాధానం. ఆత్మాశ్రయ వేదికపై ఏ వ్యక్తి కూర్చున్నా ఆ దృశ్యం ఆ మనోసౌందర్యానికి తార్కాణం. వ్యక్తి సౌందర్యం చూసే కళ్ళల్లో ఉంటుంది. కవిత్వ సౌందర్యం హృదయంలో ఉంటుందనేది నా నమ్మకం.

''ఆవె నవ్వింది నవ్వును నిర్వచిస్తూ/ అనంత ఆనందాన్ని కళ్ళల్లో ప్రతిఫలిస్తూ/ మునివేళ్ళతో ముఖంపై అమృతాన్ని చిలకరిస్తూ/ చెంపలు కెంపులుగా మారంగా అనందంగా నవ్వింది'' అంటూ వర్ణించడం ''మందహాస మకరందం'' అనే కవిత్వంలో గమనించవచ్చు. ఒక స్త్రీ నవ్వే కాదు నవ్వును వర్ణించే తీరులో కూడా సౌందర్యం ఉంది అనిపించక మానదు. మరోచోట ఒకరిని చూడాలని కూడా లేదంటారు. అసలు కలవాలని లేదు అని కూడా అంటారు. గమనించండి వీరి కవిత "కారణమేంటో నీవే చెప్పు" లో " నిన్ను నేను ఎప్పుడూ చూడలేదు/ చూస్తానో లేదో కూడా తెలియదు/ నీవెలా ఉంటావో కూడా ఊహించలేను/ నిను చూడాలని ఆకాంక్ష కూడా లేదు/ పైగా కలవాలనే ఆశా, ధ్యాసా సైతం లేవు/నీతో నిత్యం సంభాషణ జరుగుతూనే ఉంటుంది/ నాలోని ఒక విభాగమయ్యావు'' అంటూనే చివరిలో "ఇంత చెప్పినా వినకుండా వస్తానంటే నీ ఇష్టం/ నీవు రాకుండా ఉండేందుకు కారణం/ మరి వేరే ఏదో ఏముంటుంది?/ నీవే చెప్పు!" అని రచించిన తీరు చదవరులకు ఒకింత ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ కవితలో అన్నీ సందేహాలే..అన్నీ ప్రశ్నలే! కానీ పదపదంలో ఆత్మీయమైన పల కరింపు.. అనిర్వచనీయమైన అనుభూతి కనిపించడం విశేషం..

వికసించిన వదనం నుండి బయలుదేరి, చిరునవ్వుల మెరుపులతో హృదయం తన స్థానాన్ని తాను నిలబడటంలో ఖచ్చితత్వం చూపి నప్పుడు ఎదురవుతున్న శూన్యశిఖ జీవితంలో పల్లవ గుణలను ఏరుకుని ఇలా తనని నిలబెట్టింది అని చెప్పడం మనం ఎప్పుడైనా గమనించామా? ఈ పంక్తులను చూడండి "ఆకుపచ్చని శిఖరపు అంచుపై నిల్చొని ఆకాశంవైపు చూస్తే / తట్టుకోలేని పవరశ మేఘం లోలోపల తటిల్లున బద్దలై పేలి/ ఆనందపు అంబరం వర్షంలా నీ కళ్ళను తడి తాకిందంటే/ నీవు మిగిలి వున్నట్టే నీవు మనిషిగా పక్కాగా బతికి ఉన్నట్టే" అంటారు వీరు "నీవు మిగిలి వున్నట్టే'' కవితలో.. ఎంతటి సాంద్రత? ఎంతటి సౌందర్యం? అనిపించక మానదు. ప్రకృతి ఒక్కోసారి మనిషి ఆలోచనలకు బంధీ అవుతుందనే విషయం నిజం కదా అనిపిస్తుంది.

అనుకుంటాం కానీ కవి అలౌకిక ఆనందాలను స్పృశించక మానదు అని. నా దృష్టిలో అంతకంటే ఎక్కువ.. పువ్వుల నుండి పరిమళాలే వస్తాయి అనుకుంటాము కానీ ఏమో పరిమళంతో పాటూ ఏం వీస్తోందో? పువ్వులతో పాటు గాలిని అంటి పెట్టుకుని అగ్నిని కూడా రాజేస్తుందేమో ఎవరికి తెలుసు? ఇదే జీవన గతిలో ఏదయినా జరగచ్చు ఈ హృదయ వేదిక వర్ణనాత్మకం అయినప్పుడు అని నిరూపించిన కవిత్వం ఇది..

"నిశ్శబ్దంగా సాయంకాల తమ్మెర జుమ్మనిపిస్తుంది/ చెట్లపై పక్షుల అల్లరి అలికిడి కూడా తగ్గిపోయింది/ నీ రాక కోసం గుండె పూర్తిగా తలుపులు తెరిచింది/ గులాబీ రెమ్మలు ఆలస్యానికి బెంగపడి భంగపడ్డాయి/వీధి మొదలు వేల్లాడుతున్న చెట్ల కొమ్మల మధ్య/ మసక వెలుతురులో నీ అస్పష్టమైన నీడల ఆకారాన్ని/ గుర్తించేందుకు రెండుకళ్ళూ అతిగా ఆరాట పడుతున్నాయి/ తలను తిప్పి చూడలేని మెడ మొండిగానే మొరాయిస్తుంది" అనడం అద్భుతమైన ఆత్మసౌందర్య రూపకం కాక ఏమవుతుంది? చెప్పండి..

కవి విద్యాధర్ రావు గారు ఆకాశం నండి ఆకాశాన్ని, భూమి నుండి భూమిని, నక్షత్రాల నుండి నక్షత్రాలను, వెన్నెల నుండి వెన్నెలను వేరు చేయాలనుకోలేదు. వీటిని మరింత పటిష్టంగా ఒకదానికొకటి అంటి పెట్టుకుని ఉండాలనే ఆశించారు. కానీ, ఆలోచనా రేణువులు రేణువుపై చేసే నృత్యంలో హరిత వర్ణ సౌందర్యం స్పృశిస్తూ ఎదురుగా ప్రవహించే అక్షరాల నదిని అమృతాత్మకమైన సంభాషణలతో కలిపి మరింత ఆనందం పొందాలనుకున్నారు. అందుకే వీరి అక్షరాలలో ఇంత దీప్తి..

" మా బాల్కనీలోకి తొంగి చూసే/ పెద్ద చెట్టు మాయమయ్యిందే/ ఎంత పెద్ద చెట్టు దాని సిగపై/ ఎర్రని పూలు చూస్తుంటే/ ముత్తైదువ నుదుటిపై కుంకుమ వోలె భాసిల్లేవి/ పసుపు రంగులో మినమినలాడే దాని మొగ్గలు/ ముదితల పారాణిలా మిలమిలా మెరిసేవి/చేత్తో స్పర్శిస్తే కువకువ లాడేవి/ చేతిలో ఒదిగిపోయేవి/ దూరాభారం నుండి పెళ్ళికో పేరంటానికో వెళ్లొచ్చే/ అమ్మ మోసుకొచ్చిన కొండవీటి చాంతాడంతటి కబుర్లు చెబుతున్నట్లే ఉండేది" అంటూ వైజాగ్‌లో తుఫాను భీభత్స సమయంలో కోల్పోయిన చెట్టును గురించి రచించిన ఈ కవిత చదువుతుంటే గుండె భారమైంది. ఆ కోల్పోయిన చెట్టు కళ్ళముందు కనిపించినట్లు రచించిన ఈ కవితలో ఆర్ద్రత ఎంతో దాగుంది. ఇంటిముందు ఎన్నాళ్ళ నుండో ఉన్న ఒక బండరాయి కదిలినా మనసుకు ఏదో వెలితి. అలాంటిది ఏకంగా నీడనిచ్చే చెట్టే మాయమైతే మన సహచరులు మాయమైనట్లే అనిపిస్తుంది. కదిలే చరిత్రలో అలల పుటలు మనో వికారంతో చేతులు కలిపినప్పుడు ఇలాంటి అవాంతరాలే ఒక్కోసారి ఏర్పడి చెప్పుకోలేనంత ఒంటరితనాన్ని కలిగిస్తాయి..

సాధారణంగా కవి తన కవిత్వాన్ని పరిస్థితులు బలహీనమైనప్పుడో, లేక మరింత బలపడినప్పుడు రచిస్తారనేది వాస్తవం. కానీ సమస్త పరిస్థితుల్ని సర్వకాలాల్ని అక్షరాలలో సజీవ చిత్రాల్లా ఇమడ్చడం కొందరే చేస్తారు. అందుకు ఉదాహరణే వీరు రచించిన జ్ఞాపకాల దుమారం, అవయవ దానం ప్రాతిపదికగా రచించిన ఇదంతా నిజంగా నిజమేనా కవిత, సెల్‌ఫోన్‌లలో మునిగిన మిత్రుల్ని చూస్తూ రచించిన "ఒక్కసారి తలెత్తు నేస్తం కవిత, సోదరులను విడదీసిన సందర్భంలో రచించిన కవిత "తీరం దాటని తుఫాను, నిలువ నీడల్ని కోల్పోతున్న బతుకులను చూస్తూ రచించిన ''మొండి గోడల మోహంజదారోలు కవిత, చువ్వకు వేల్లాడే చూపులు, పెంపుడు పక్షులు, రుధిర పాదం కవితలు. వీరు ఈ సంపుటిలో రచించిన వంద కవితల సమాహారం ఇది. సమాజంలోని ప్రతి కదలికనూ గాలితో కలిపి మరింత ద్విగుణీకృతంగా వేల్లాడదీసిన వీరి భావాలు మరీ మరీ చదివించేలా ఉన్నాయి. వస్తువంటే ఆవేదనే కాదు. వస్తువంటే ఆవేశమే కాదు, వస్తువంటే ఆలంబనే కాదు, వస్తువంటే అలంకారం. వస్తువంటే ఆభిజాత్యం, వస్తువంటే భావ వైశాల్యం అని నిరూపించారు ఈ కవితా సంపుటిలో కవి విద్యాధర్ రావు గారు. నేలపై మట్టి పొరల్ని రువ్వుతూ రాళ్ళపై గుట్టలపై నిరంతరం నిలుచున్న మనుషుల్లో రంగు రంగుల పూలు, ఆదర్శవంతమైన ఫలాలు నేరస్తుల్లా కనిపిస్తాయి. కానీ వాటితో పాటు మానవతా సందేశం కనిపిస్తుంది అని తెలియజేయడమే ఈ అంతరంగపు భాష అంతరార్థం.

కవికి అభినందనలు...

ప్రతులకు: డా॥ జెల్లి విద్యాధర్ రావు,
ఇ.నెం. 8-6-906/సి/339,
స్ట్రీట్ నెం.15,క్రిస్టియన్ కాలనీ,
హస్తినాపురం
హైదరాబాద్-500 070

-శైలజామిత్ర
9290900879

ఈనెల 13న సిటీ కల్చరల్ సెంటర్‌లో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన 'వర్ణిక' గ్రంథావిష్కరణ, పరిచయ సభలో ప్రసంగించిన బిక్కి కృష్ణ, డా॥ వెనిగళ్ళ రాంబాబు, ఇసనాక మురళీధర్, విజ్జి, దామరాజు రామలక్ష్మి, రాధా కుసుమ, సంతోష్, రమాదేవి కులకర్ణి, రాజ్‌కృష్ణలను సత్కరిస్తున్న రచయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, బైస దేవదాసు.

ఆ 'మానవుడు', మన కె.ఎల్.రెడ్డి

-ఆచార్య మాడభూషి శ్రీధర్
8447651505

కె.ఎల్.రెడ్డి మొత్తం తెలంగాణ జనానికి తెలిసిపోవడానికి కారణం ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావ్‌గారు దానికి కారణం మంచి రచయిత జి చక్రధర్ రాసిన ఒక వ్యాసం. చక్రధర్ గారు కె ఎల్ రెడ్డి గురించి రాసాడు కనుక ఆ వ్యాసం చదివింది ఎవరంటే ముఖ్యమంత్రి. చదవగానే చేసిందేమంటే రచయిత, పాత్రికేయుడు కె.ఎల్.రెడ్డికి వెంటనే ఫోన్ చేసారు ముఖ్యమంత్రి.

మరో వ్యక్తి ఎవరంటే.. ఎం.వి.ఆర్.శాస్త్రి. కె.ఎల్. తన పత్రికకు రాయగలిగినా కనీసం కావలసిన డబ్బు ఇవ్వలేకపోతున్నందులకు శాస్త్రి బాధ పడ్డారు. కె.ఎల్.గురించి పత్రికలో వ్యాసం రాయాలనడంతో చక్రధర్ ఆ పని చేసాడు అద్భు తంగా. దాన్ని భూమిక పేరుతో ఆంధ్రభూమి పత్రికలో శాస్త్రి ముద్రించారు.

శాస్త్రిగారు '...2016 లో ఒక రోజు ఆంధ్రభూమి ఆఫీసులో... కె. ఎల్. రెడ్డి నన్ను కలిశాడు. 'నెలకు 15 వేలు ఉంటే గడిచిపోతుంది. రోజూ వచ్చి రాసి పెడతాను' అన్నాడు. 80 దాటాడు. గూని వచ్చింది. ఇంకా రాయటం నీ వల్ల కాదు. అది పరిష్కారం కూడా కాదు. నీ గురించి పత్రికలో ప్రత్యేక వ్యాసం వేద్దాం" అన్నాను. మిత్రుడు గోవిందరాజు చక్రధర్ గారు రచించారు. మా డైలీ ఫీచర్స్ సప్లిమెంటు "భూమిక" మొదటిపేజీలో ప్రముఖంగా వేశాము. ఎవరూ పనిగట్టుకుని పైరవీ చేయాల్సిన అవసరం లేకుండా అందరికంటే ముందు ముఖ్యమంత్రి కె.సి.ఆర్.గారు పొద్దున్నే ఆ వ్యాసం చూసి నేరుగా తానే కె.ఎల్.రెడ్డికి ఫోన్ చేసి పిలిచారు" అది ఆశ్చర్యం.

కరిగిపోయిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుగారు నీకు 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నానన్నాడు. దానికి అమాయకుడు ఏమన్నాడో తెలుసా? 'నాకు నెలకు 10 వేలొస్తే చాలు' అన్నాడట. ఒక అధికారి లెక్క చేసి, పదిలక్షల రూపాయలు బ్యాంక్‌లో ఎఫ్.డిచేస్తే వడ్డీ 8 వేల దాకా రావచ్చు అన్నారు. **'సరెలే చాలు. నేను ఇంకో రెండు వేలకు ఎవరి దగ్గరైనాపనిచేస్తలే"**అని కె.ఎల్. అన్నాడు. 15 లక్షలు ఎఫ్.డి. చేస్తే నెలకు 12 వేలు వడ్డీ వస్తుందని లెక్కలేసి అధికారి వివరించడంతో ముఖ్యమంత్రి గారు మళ్లీ 15 లక్షల రూపాయలు మంజూరుకు ఆదేశించారు.

కె. ఎల్. రెడ్డి ఎప్పుడూ తెలుగులోనే మాట్లాడేవాడు. సార్ అనే మాట బదులు ఎవరినైనా ఆ 'మానవుడు' అంటూ ఉండేవాడు. తెలుగు భాషలోనే సాధ్యమైనంత వరకు మానవుడా అనే వాడు. కె. ఎల్. రెడ్డి 'మానవుడు' సంతోషించేవాడని ఎం.వి.ఆర్. శాస్త్రి అనేవాడు. ముఖ్యమంత్రిని ఎన్నో సందర్భాల్లో కె.ఎల్. గుర్తు చేసుకునే వాడు.

ఆ సామాన్యుడు మాన్యుడు కె.ఎల్.రెడ్డి 93 సంవత్సరాలు దాటిన తరువాత వరంగల్లు దగ్గర గొర్రెకుంటలో కీర్తిశేషులు ప్రొఫెసర్ పర్మాజీ నిర్మించిన ఆశ్రమ్‌లో నవంబర్ 3 తెల్లజామున కాలధర్మం చెందారు.

×××

"నువ్వు పెద్ద పత్రికలో వార్తలు రాస్తే చాల మందికి తెలిసిపోతుంది. ఏదో ఒక చిన్న పత్రికలో రాస్తె ఎవరి కైనా అందుతుందా". అని కె. ఎల్.రెడ్డి తనతో మా నాన్న(సహాధ్యాయుడు ఎం.ఎస్.ఆచార్య)తో పంచాయితీ చేసేవాడు. పెద్ద పత్రికలో చిన్నవాడుగా ఉండేకన్నా చిన్న పత్రికలో పనిచేసి పెద్దవాడవాలని, పెద్ద పత్రికలు న్యాయంగా నిష్పక్షకంగా వ్యవహరించడం సాధ్యమా అని కె. ఎల్.తో నాన్న అనేవాడు.

అప్పుడు వరంగల్ వాణి అనే పేరుతో ఎం.ఎస్. ఆచార్య 1980 నుంచి 1994 దాకా దినపత్రిక నడిపేవారు. అంతకుముందు జనధర్మ పేరుతో 1958 కాలం నుంచి 1980 దాకా వారపత్రిక నడిపేవారు. పత్రికలు నడపడానికి ప్రకటనల కోసం లంచాలు అడిగే ప్రభుత్వంలోని కొందరితో లాలూచీ చేసుకునేవాడే కాదు. దాని బదులు పత్రికలు నిలిపివేయడం నయం అనుకునే వాడు.

×××

ఈ పెద్ద పత్రికలు నడిపేవారు పార్టీలతో లాలూచీ పడేవారని కె.ఎల్.కు అర్థమైపోయింది. చెన్నారెడ్డి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం విజృంభించిన పోరాటాన్ని ద్రోహచర్యం అని తిట్టేవాడు కె. ఎల్. రెడ్డి. ఎం ఎస్ ఆచార్య తన పత్రికల్లో తీవ్రంగా విమర్శించేవాడు, తరువాత పత్రికలు ప్రజలకు అనుకూలంగా కాకుండా తమ అవసరాలకు, సంపాదించే డబ్బు సంపాదకులుగా మారిపోయేవారని అప్పుడు నాన్నగారు ఆ తరువాత కె ఎల్ కూడా అనేవారు.

చెన్నారెడ్డిపై పోరు

తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజుల్లో దేవులపల్లి ప్రభాకరరావు సారథ్యంలో వెలువడిన 'జనత' పత్రికలో నెలకు రూ.150ల వేతనానికి కె.ఎల్. రాసేవారు. 'జనత' ఆగింది. తర్వాత 'నేడు' అని కరపత్ర దినపత్రిక వచ్చేది. మూడు నెలలపాటు చిన్న రెండు పేజీల కరపత్రంకు పది పైసలతో పత్రిక వచ్చేది. సికిందరాబాద్‌లో దినపత్రిక విక్రయించే ఏజెంటు మల్లయ్య ఆర్థిక సహాయం చేసేవాడు. 1969 రోజుల్లో చెన్నారెడ్డి ఉద్యమ వార్తలతో 'నేడు' మొదటి కరపత్రంలో 'తెలంగాణ సింహకిశోరం చెన్నారెడ్డి' అంటూ రాసాడు. కాని తన చివరి కరపత్రంలో "తెలంగాణ ద్రోహి చెన్నా" అనే ప్రధాన శీర్షిక తాటికాయంత అక్షరాలతో కె.ఎల్. ప్రచురించారు. మంత్రులు నాయకులు వారికి అవసరం లేదు. తెలంగాణ ముఖ్యం. అంతకుముందు 14 స్థానాల్లో 10 లోక్ సభ స్థానాల్లో తెలంగాణ ప్రజాసమితి గెలిచింది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ అకస్మాత్తుగా అర్ధరాత్రి హైదరాబాద్ కు వచ్చి చొక్కారావుతోనూ, చెన్నారెడ్డితోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పదవి నుంచి కాసు బ్రహ్మానందరెడ్డిని తీస్తే చాలన్నాడట. అంతే చెన్నారెడ్డి పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసిపారేసారు.

×××

ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా వెళ్ళిపోయారు. 23.9.1971 జనధర్మ పత్రిక ఎడిటర్ ఆచార్య "గంగలో కలిసి తీర్థంగా మారినట్లు కాంగ్రెస్ లో కలిసి పురంపడిన ప్రజాసమితి" అని విమర్శించింది. తెలంగాణ ఉద్యమం చల్లారిపోయింది. ఆచార్య గారి వలెనే కె.ఎల్. రెడ్డి కూడా చెన్నారెడ్డిని క్షమించలేదు.

కాని కరపత్ర 'పత్రిక'ను నడిపిన కె.ఎల్.రెడ్డిని పోలీసులు పట్టుకున్నారు. కోర్టులో నిలబెట్టారు. దిల్లీ నుంచి వార్తా పత్రికల రిజిస్ట్రార్ ఆమోదం లేకుండా పత్రికలాంటి కరపత్రం నడిపినందుకు ఓ న్యాయాధికారి రెడ్డికి నెలరోజుల కఠిన కారాగార శిక్ష విధించారు. కె.ఎల్.ను అప్పుడు ఒక ఖైదీ "నువ్వు ఎవరిని చంపావు" అడిగాడు. అందుకు 'నేనె వ్వరినీ చంపలేదు. ఏ నేర మూ చేయ లేదు" అని చెప్పాడు రెడ్డి. "మరి ఏ నేరానికి జైల్లో తోసిండ్రు" అని మరో ప్రశ్న. తెలంగాణ కోసం పత్రిక తీసినందుకు అంటే ఆశ్చర్యపోయారు. అప్పుడు ఖైదీలలో సానుభూతి, గౌరవం పెరిగింది. ముషీరాబాద్ జైలులో కె.ఎల్. ండ్డి రోజూ దినపత్రికలు చదివి అందరికి విషయాలు తెలియజేసేవారు. అన్యాయంగా కె.ఎల్. రెడ్డి నెలరోజులు కఠిన జైలుశిక్ష అనుభవించారు.

ఉన్నదున్నట్టన్నడు

రెడ్డి 'ఈనాడు' దినపత్రికలో 1975 కు ముందు రాతపరీక్షలో పాస్ అయ్యాడు. రామోజీరావుతో ఆనాడు ఇంటర్వ్యూలో ఉన్నదున్నట్టు చెప్పాడు. "నువ్వు తాగుతావా?" అని ఆయన అడిగారట. "మందు చాలామంది తాగుతారు. నేను తెలంగాణ రెడ్డోణ్ణి. రెడ్లందరూ తాగుతరు. నేనైనా అంతే. పండగలూపబ్బాలూ పెళ్లి, పెండ్లిండ్లూ వస్తే తాగేవాళ్లం. నేనెప్పుడూ వాంతులు చేసుకోలే" అని ఉన్నది ఉన్నట్టు చెప్పడం ఆయనకు నచ్చింది. అందుకే ఉద్యోగం ఇచ్చారు రామోజీరావు.

ఎం వి ఆర్ శాస్త్రి తన బ్లాగ్ స్పాట్ లో రాస్తూ. 'అప్పట్లో రామోజీరావు గారు రోజూ ఉదయానే పేపరు మొత్తం చదివి, తప్పులు మార్క్ చేసి, ఘాటుగా కామెంట్లు రాసి అందరికీ సర్క్యులేట్ చేయించే వారు. ప్రతి మంగళవారం ఎడిటోరియల్ హెడ్స్ తో మీటింగు పెట్టి లోటుపాట్లు నిశితంగా చర్చిస్తుండేవారు. ఎప్పుడు చివాట్లు పడతాయోనని న్యూస్ ఎడిటర్ సంతపురి రఘువీరరావు, చీఫ్ సబ్ వేమూరి సుబ్రహ్మణ్యం అంతటి ఉద్దండులు కూడా భయపడుతుండేవారు. అలాంటి చండశాసనుడైన చైర్మన్ ను పట్టుకుని "మీరసలు పేపర్ చదువుతారాండి" అని ఒక రోజు మీటింగులో అడిగినవాడు కె.ఎల్.రెడ్డి. ఆ మాటకు ఫకాల్న నవ్వాడు చైర్మన్' ఆనాడు.

ఎవరినీ లెక్కచేయడు

"కె.ఎల్.రెడ్డి ఎవరినీ లెక్క చెయ్యడు. నచ్చకపోతే ఎవరిమాటా వినడు. మొహాన్నే దులిపేస్తాడు. రోజుకు 14 గంటలు గొడ్డులా పనిచేస్తూ ఎప్పుడు చూసినా ఆఫీసులోనే పని చేసేవాడు. సోమాజిగూడ ఆఫీసులోనే లైబ్రరీ మీది సింగిల్ రూములో ఉండేవాడు. ఆజన్మ బ్రహ్మచారి. నిప్పులాంటి మనిషి. నిజాయతీ పరుడు. అల్ప సంతోషి. మాడభూషి శ్రీధర్ వంటి ఎందరో జర్నలిస్టులను తీర్చి దిద్దిన గురువు. మంచి మనిషి. స్నేహశీలి. కడదాకా నాకు మంచి మిత్రుడు. ఈనాడు తరవాత ఎన్నో కొత్త పత్రికలలో పని చేశాడు. ప్రతి పత్రికనూ మొత్తం తానే రాసి ఒంటి చేత్తో నెట్టుకొచ్చేవాడు. అలా ఎన్ని పత్రికలను నిర్వహించాడో అతడికే లెక్క తెలియదు.

''తెలంగాణా ఊసే ఎవరికీ, ఏ నాయకుడికీ పట్టని కాలాన 1980లలోనే "తెలంగాణ" పత్రిక పెట్టి అన్యాయాలపై ధ్వజమెత్తి తెలంగాణ క్షేమం కోసం తపించి, నిస్వార్థంగా పోరాడిన వాడు కె.ఎల్.రెడ్డి. అప్పట్లో ఫతేమైదాన్ ప్రాంగణంలో చిన్నగదిలో ఉండి అక్కడినుంచే పత్రిక నడిపేవాడు. జర్నలిస్టులు, ఎర్నలిస్టులు ఎంత మంది ఉన్నా కె.ఎల్. రెడ్డి ఒక్కడు చాలు పాత్రికేయ వృత్తి గర్వంగా చూపించుకోవటానికి. ఎక్కడ ఉన్నా ప్రతి దసరాకూ ఫోన్ చేసి పట్టుబట్టి తన దగ్గరికి పిలిపించుకునే కె.ఎల్.రెడ్డి కన్నుమూయటం నాలాగే చాలా మంది జర్నలిస్టులకు తీరని వెలితి" అని శాస్త్రిగారు బాధ పడ్డారు.

వరంగల్‌లో కె.ఎల్. రెడ్డి ...

1975 లో కె. నరసింహారెడ్డి వరంగల్ ఈనాడు పత్రికా విలేకరిగా వచ్చారు. చాలా కమిట్ మెట్ కలిగిన వాడు. మేధావి, మహోత్తముడు పాములపర్తి సదాశివ రావు గారు దార్శికుడి వంటి వాడు నరసింహారెడ్డి. కాని ఆయన తరువాత వరంగల్ విలేకరిగా కె.ఎల్. రెడ్డి వచ్చారు. అప్పడికీ వారికి మంచి పరిచయాలు తెలుసు. ఆ కాలంలో ఈనాడు పత్రికలో సమ్మె రావడంతో కె.ఎల్. హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. కనుక వరంగల్ కు విలేకరిగా ఈ రచయిత (శ్రీధర్)ను 1977లో నియమించారు. 1977కు ముందు సమ్మెను అధిక శాతం కార్మికులు జరుపుతున్న రోజుల్లో పత్రిక ప్రచురించడానికి మనం నిలబడాలని కె. ఎల్.రెడ్డి అనుకున్నారు. ధైర్యంగా న్యాయం కోసం ఆయన పోరాడుతున్నా నుకున్నారు.

కాని నిష్పాక్షం లేదని, పక్షపాతం విపరీతంగా ఉందని తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్నారని కొన్ని సంవత్సరాల తరువాత ఆయనకు అర్థమైంది. కె ఎల్ జనరల్ షిఫ్టు (సెంట్రల్ డెస్క్) పనిచేసే ఎడిషన్ రాత్రి ఒంటిగంట తర్వాత రాజీనామా లేఖ రాసి మర్నాడు రామోజీరావుకు ఇవ్వమని అటెండర్‌కు చెప్పి, లేఖ ఇచ్చి వెళ్ళిపోయారు.

తనకు చిన్న గది చాలు నేను కావాలనుకున్న వార్తలతో జనాన్ని కదిలిస్తాను అని నమ్మినవాడు కె. ఎల్. రెడ్డి. ప్రభుత్వాలు, పార్టీలు, మంత్రులు, వాళ్ల పత్రికలు, మాధ్యమాలు, దేశాన్ని ఎంఎల్యేలను వోట్లను, టోకుగా అమ్ముకొనే వారు, మధ్యదళారులు, కలిసి పోయారని పాపం కె. ఎల్. రెడ్డికి అర్థం కాలేదు.

తెలంగాణ మలి దశపు పోరాటం మొదలైంది. 2001లో దినపత్రికలలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు తన తెలంగాణ పార్టీ ప్రారంభిస్తారని వార్త తెలియగానే కె. ఎల్. కొందరితో సమావేశానికి వెళ్ళారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జలదృశ్యం నివాసగృహం పై భాగంలోనే కె.సీ.ఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆఫీసు ఉండేది.

"కేసీఆర్ తెలంగాణ నాయకులెవ్వరూ తెలంగాణ భాషలో, యాసలో మాట్లాడలేదు. కానీ ప్రజల భాషలో గుక్కతిప్పుకోకుండా చెప్తున్నాడు. నిస్సందేహంగా తెలంగాణ ప్రజలను ఆకట్టుకుంటాయి. నివురుగప్పిన తెలంగాణ నిప్పును కేసీఆర్ మళ్ళీ రాజేస్తాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేదాకా ఈ నిప్పు ఆరదనిపిస్తున్నది. నా ఈ నమ్మకం వమ్ముకాదు. కేసీఆర్ నిజం చేసి చూపిస్తాడని కె.ఎల్. రెడ్డి చక్రధర్‌కు వివరించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అంటే కె. ఎల్.కు చాలా ఇష్టం. తెలంగాణ రాష్ట్ర సమితిని సమర్థించారు. కాంగ్రెస్, బిజెపి దొందు దొందే అని అనుకునే వాడు. ఈ పార్టీల కన్నా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ముఖ్యుడని నమ్మాడు. వారికన్న కె. తారక రామారావు (కె.టి.ఆర్)చాలా సమర్థుడని అన్నాడు కూడా.

ఆశ్చర్యం...

స్వార్థం లేదు. వివాహం లేదు. చిన్న మంచం. ఓ పళ్లెం. కొన్ని గిన్నెలు లేదా నాలుగైదు పాత్రలు చాలు. ఆశలు లేవు. కాళ్లు చాలు కార్లవసరం లేదు. నాలుగైదు లాల్చీలు పైజామాలు చాలు. పెన్నులు, కాగితాలు చాలు అనేవాడు కె.యల్. రెడ్డి.

నా రచనలంటే కె. ఎల్. కు ఇంతో ఇష్టం. 1977 కాలంలో నేను విలేకరిగా కొన్ని సలహాలు అడిగేవాడిని. ఓ ఉత్తరం రాసి పంపారు. 'నన్ను ఇట్ల అడగవద్దు. నీకు సొంతంగా ఏం రాసుకోవాలంటే రాసుకో, నాకు చెప్పుకోకు అసలు' అని.

విలేకరిగా 2 సంవత్సరాలు పనిచేసిన తరువాత ఈనాడు నుంచి మరో ఉద్యోగం చేసేవాడిని నేను. వరంగల్ లో ఆంధ్రప్రభ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో పనిచేసారు. తరువాత ఉదయం పత్రికలో పదేళ్లు పనిచేసాను. కె. ఎల్. రకరకాల పత్రికలలో పని చేస్తున్నప్పుడు నేను కొన్ని వ్యాసాలు రాసేవాడిని.

బైస దేవదాసు నడుపుతున్న 'నేటినిజం' దినపత్రికలో పదేళ్ళకు పైగా పనిచేశారు. ఇద్దరి మధ్య మంచి బంధం ఏర్పడింది. ఆఫీసులో అందరికీ జర్నలిజం గురించి క్లాసులు తీసుకునేవారు. చిన్న కప్పు చాయ్ సరిపోదు అనేవాడు. మొత్తం పెద్ద గ్లాసులో చాయ్ ఇవ్వాల్సిందే.

తెలుగు పదాలంటే ప్రేమ. అందింపజేసారు అనే మాట సరిపోదనే వారు. ఇచ్చారు అంటే చాలు కదా. మాట్లాడుతూ అన్నారు, చికిత్స పొందుతూ మరణించారు అనే పదాలు చాలా దారుణంగా ఉంటాయని అనేవారు. కాని దురదృష్టం ఏమంటే కె. ఎల్. రెడ్డి మరణం గురించి కూడా ఈ విధంగానే రాసారు. ఈ వార్తలు చదివితే ఏమయ్యేవాడో.

కంచర్ల లక్ష్మారెడ్డి అంటే ఎవరికీ తెలియదు. కె. ఎల్. రెడ్డి అంటేనే అర్థమవుతుంది. నల్లగొండజిల్లా పరసరాయిపల్లెలో 92 సంవత్సరాల కిందట పుట్టి 1955లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఏ చదువుకున్నాడా యన. సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి హైదరాబాద్ రాజకీయ పత్రిక 'తెలుగుదేశం'లో వార్త రచయితగా ఉండేవారు. 'ఈనాడు', 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రభూమి' పత్రికల్లో కూడా పని చేశారు. రాకూర్ హరిప్రసాద్ హైదరాబాద్ ఇంగ్లీషు పత్రిక 'ఇండియన్ హెరాల్డ్'లో కూడా పని చేశారు. వయోధిక పాత్రికేయుడు వి. హనుమంతరావు నడిపించిన వారపత్రికలోనూ బైస రామదాసు నడిపిస్తున్న 'పొద్దు' దినపత్రికలో, జి. రామారావు తెచ్చిన వారపత్రిక 'వారం వారం'లోనూ, పాంచజన్య నిర్వహించిన 'మహానగర్'లో కూడా పనిచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకాలంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నడిపిన 'తెలంగాణప్రభ'లో కూడా చేశారు.

అప్పుడు నేను ఉదయం పత్రికలో ఉన్నపుడు వారంలో అప్పుడప్పుడు లాల్ బహదూర్ స్టేడియం పక్కన ఫతేమైదాన్ క్లబ్ లో ఒక గదిలో చాలాకాలం కె ఎల్ రెడ్డి ఉండేవాడు. ఆయన గురించి ఇంకెంత రాసినా సరిపోదు.

నా బాధ

కె. ఎల్. ఆరోగ్య పరిస్థితి గురించి కొందరు ఫోన్ చేసి నాకు చెప్పారు. వరంగల్‌లోని ఆశ్రమంలో ఈటెల సమ్మన్నగారి సాయంతో చేర్పించడం జరిగింది. కె.ఎల్. ఎందుకో కోప్పడేవాడు. కొన్ని నచ్చేది కాదు. ఇంకా ఏదో కావాలని కోరేవాడు. అంతకుముందు ఓ సారి ఉన్నట్టున్నట్టు వరంగల్ ఆశ్రమం వదిలి హైదరాబాద్ వచ్చేశారు. నన్ను కూడా కోప్పడ్డాడు. "నీకేమీ చెప్పను" అని వెళ్లిపోయాడు. ఏం చేస్తాను? తరువాత కొన్నాళ్లకు చాలామంది పెద్దలు ఆయనకు సాయం చేసారు. ఎన్ని ఇబ్బందులున్నా, ఆయన కోప్పడినా సరే, సాయం చేసారు.

కాని ఈమధ్య ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. తరువాత ఓరోజు నాకుఫోన్ చేసారు. నాతో నువ్వు అనే చాలాచనువు కలిగిన వాడు. మీరు అంటే బాధ పడ్డాను. 'మీరు నాకు సాయం చేయండి. వరంగల్ ఆశ్రయంలో చేర్పించండి" అని కోరారు. తప్పకుండా మీకు పంపిస్తాం అని నన్ను మీరు అనకండి అని చెప్పుకున్నాను. ఈటెల సమ్మన్న పలువురు మిత్రుల సహకారంతో ఆశ్రమంలో చేరిన 15 రోజులకే అందరికీ దూరమయ్యారు. మంచి మనిషి, గురువుగారు, నవంబర్ 2 రాత్రి ఆయన కాలధర్మం పొందారు. ఎవరు మాత్రం ఏ చేయగలరు?

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బాల వెంకట్రావు రచించిన "అఖిల భారత పశు (జంతు) ప్రదర్శన" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥.కె.వి.రమణాచారి. వేదికపై కె.పి. అశోక్‌కుమార్, వెంకట్రావు, సింహప్రసాద్, విహారి, రఘుశ్రీ, డా॥ మామిడి హరికృష్ణ, దైవజ్ఞశర్మ, బందారుపల్లి.

కళావేదికలో లలిత గీతాల

గానసభ కళా సుబ్బారావు కళావేదికలో ఏవీ సావిత్రి 24వ లలిత గీతాల గాన పోటీలు ఆదివారం నిర్వహించారు. నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ప్రముఖ లలిత గీత స్వరకర్త మహా భాష్యం చిత్తరంజన్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వేమరాజు విజయకుమార్ అధ్యక్షత వహించగా, రావూరి మాధవి, కామిశెట్టి గోదాలక్ష్మి పాల్గొన్నారు.

బాలరత్న పురస్కారాల ప్రదానం

త్యాగరాయ గానసభలో ఆదివారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభావంతులకు బాలరత్న పురస్కారాలను ప్రదానం చేశారు. కమలాకర లలిత కళాభారతి, కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ డా॥ వీ. కృష్ణమోహనరావు, విద్యావేత్త ప్రొఫెసర్ సులోచనదేవి, విశ్రాంత న్యాయమూర్తి, మాల్యాద్రి, సంగీత దర్శకులు లక్ష్మణ్‌సాయి, నిర్వాహకులు భారతీ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించు

మంచి చెడులన్నవి
రెండుమార్గములు
నిత్యజీవనంలో

తారసిల్లుగుణములు
మంచివారి స్నేహం

మధురిమలు కురిపించు
చెడ్డవారి స్నేహం

ఇబ్బందులు కలిగించు
గాలి పూలతోచేరి సుగంధపు
పరిమళాలు వెదజల్లినట్లు
వ్యర్థాలతో చేరి దుర్గంధపు
వాసన పంచినట్లు
జీవిత గమనంలో
ఏ మార్గాన్ని ఎంచుకుంటావో
ఊహల తలపులతో
ఏ విధంగా నడుచుకుంటావో
ఆలోచించు ...ఆలోచించు .....
మంచివాడిగా
చరిత్రలో నిలబడతావో
చెడ్డవాడిగా కనుమరుగైపోతావో

-డి.టి.హేమంత్ సింగ్
8121430560

చదువు

ఎదగడానికి ఎన్ని మెట్లు ఎక్కినా
మొదటి మెట్టే ఆధారం..
నిరంతర కృషితో అంతర్గతంగా
దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి
కఠినంగా ఉన్న దాన్ని సరళంగాను
సరళంగా ఉన్న దాన్ని అలవాటుగాను
అలవాటుగా ఉన్న దాన్ని ఆహ్లాదంగాను
తయారు చేసుకోవడమే
విద్యార్థుల ప్రధాన కర్తవ్యం..!

- వి. మంగతాయారు
సెల్: 9949278483

బహుముఖ ప్రజ్ఞాశాలి జలజం

తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా జలజం సత్యనారాయణ పేరుగడించాడని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. నవంబర్ 9 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ లోగల కాళోజీ హాల్ లో జరిగిన ఇప్పపూలు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజం సత్యనారాయణ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా మార్గదర్శనం చేశారన్నారు. దక్షత కలిగిన నాయకుడన్నారు. జలజం రచనలు ఆసాంతం చక్కగా చదివిస్తాయన్నారు. ప్రముఖ న్యాయవాది బుర్రి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ జలజం అందరికీ ఆత్మీయుడన్నారు. బహుభాషావేత్తగా రాణించిన జలజం అనువాదకుడిగా గొప్ప పేరుప్రఖ్యాతలు సంపాదించుకున్నాడన్నారు. సభాధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్ణసుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జలజం మానవత్వం మూర్తీభవించిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. అనంతరం మంత్రి ఇప్పపూలు పుస్తకాన్ని అంకితం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.రవీందర్, పి.పి. బెక్కెం జనార్దన్, జలజం సుషుమ్న రాయ్, జలజం వైశిషిరాయ్, జలజం విదుషీరాయ్, కె.లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కోట్ల వేంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెక్కల కెక్కు

సున్నా! సున్నా !! సున్నా!!!
మూడు సున్నాల ముందు
ఒకటి చేరిస్తే ఒక వెయ్యి!!
సున్న నీ టే సర్దుబాటు తో
చేర్చును భాగాలు భాగ్యాలు!!
సర్దుబాటు తో బతుకుబా ట
బహు బాగు యెంతెంతోమేలు!!
బాల్యంనుంచీ లెక్కల్లో
లెక్కకెక్కితే చిక్కులు నీ దవు !!
రొక్కం చక్కదనాలు నిండుగా
బతుకంతా భాగ్యం పొందును !!
సున్నా అంటే సూన్యం కాదు
సున్నా అంటే సౌభాగ్యం !!

-ఎల్. రాజా గణేష్,
9247483700

ఉమాశశి సాహితీ సేవలు స్ఫూర్తిదాయకం

సాహితీ రంగానికి రచయిత్రి డాక్టర్ ఉమాశశి అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలో ఉమాశశి రచించిన తెలుగు దినపత్రికల్లో భాషా విశేషాలు, భారతం పంచనాయకం రెండు వ్యాస సంపుటిలను ఉస్మానియా యూనివర్శిటీ విశ్రాంతాచార్యులు స్వరాజ్యలక్ష్మి సోమవారం రాత్రి ఆవిష్కరించారు. మానస ఆర్ట్ థియేటర్స్ సాహితీ జిగీష నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వరాజ్యలక్ష్మి మాట్లాడారు. భాషపై అవగాహన పెంపునకు, పురాణపాత్రల గురించి తెలుసుకోవడానికి సంపుటిలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సాహితీవేత్త ఎమ్. దత్తాత్రేయశర్మ అధ్యక్షత వహించిన సభలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి,సాహితీవేత్త ఆచార్య గౌరీశంకర్, ప్రొఫెసర్ నిత్యానందరావు, లలితవాణి, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజలస్నానం !

జ్ఞానం పవిత్రనదీజలం వంటిది
దానిలో నిత్యం స్నానం చేయాలి
శరీరానికి జలస్నానంలా
మనసుకు జ్ఞానజలస్నానం
మాలిన్యనివారకం !
మనోమాలిన్యాలు
మనిషిని పాడు చేస్తాయి
అధోగతికి తోస్తాయి
పుణ్యద్వారాలను మూసివేస్తాయి
అభ్యుదయాన్ని నిరోధిస్తాయి !

డా॥ అనుమాండ్ల భూదేవశర్మ
9440468557.

యాదికొస్తున్న పల్లె

మర్చిపోలేను మర్చిపోలేను నా పల్లెను...
మా ఊరిలో గడిపిన నా బాల్య జ్ఞాపకాలను...
ఆకుపచ్చని పరికిణి చుట్టుకున్నట్లు ఉండే పడచు పల్లె...
సాంబ్రాణి వెధ జల్లినట్లు వచ్చే తడి మట్టి సువాసనలను ...
మువ్వల సవ్వడిలా వినబడే సెలయేరుల నవ్వులను ...
సంగీతానికే భానీలు అద్దినట్లు
ఉండే పక్షుల కిల కిల రాగాలను ....
ఎయిర్ కండిషనర్ నే తల ధన్నెలా వీచే చల్లనిగాలులను...
(మర్చి పోలేను మర్చి పోలేను నా పల్లెను)
స్నేహితులతో కలిసి ఆడిన ఆటలను ,
అరుగుమీద కూర్చొని ఆడిన ముచ్చట్లను ...
పెరడి తోట లో కోసుకొని తిన్న పండ్లను ,
ఎముకలు కొరికే చలికి కాసిన చలి మంటలను ..
తమ కష్టాన్ని నమ్ముకొని బ్రతికే శ్రామిక జీవులను...
ఆనందం లోను దుఃఖం లోను
తోడుగా వెంట నిలిచే సన్నిహితులను ...
కల్మషం అంటేనే ఎరుగని
హృదయాలున్న మనుషులను .....
ఎంత ఎదిగినా చెరిగిపోని
నా భాల్య జ్ఞాపకాలను ..
మర్చిపోలేను కన్న తల్లి లా
నను కాచిన నా పల్లెను...

-బి. శైలజ
8919031753

సాహిత్య పరిమళాలతో ఎగిరిన దీర్ఘకవిత 'పల్లెకు పోదాం మళ్లీ'

కవిత్వం కోసం నిరంతరం తపించే ఒక కవి ఆలోచనా మేఘాలనుంచి ధారగా కురిసే భావాల జడివాన కాగితాన్ని ముద్దాడినప్పుడు, మట్టికణాల పురిటివాసన సాహిత్యంతో సహవాసం చేస్తుంది. శబ్దాలు వినిపింపు కాని, దండోరా మ్రోగిస్తూ కవితనిండా పదాల కూర్పు సైనిక విన్యాసాలు చేస్తుంది. మొదటి పాదంలో ఎత్తుగడ, తండ్రి భుజాలను ఎక్కిన పిల్లాడి చిరునవ్వులా వుంటుంది. ముగింపు చేరుకునే సరికి, ఆ పిల్లాడు ప్రతి పాదంలోనూ క్రమ, క్రమంగా తన రూపాన్ని విశ్వరూపంగా మార్చుకుంటూ, చివరికి ఒక సాహిత్య ప్రయోజనాన్ని తలమీద కిరీటంలా ధరిస్తాడు. ఆ కవితను చదివిన ఏ కళ్లయినా తన కనురెప్పలతో కరతాళ ధ్వనులకు స్వాగతం పలుకుతాయి. తెలుగు భాష మయ్యూరమై నటనమాడిన ఆ సందర్భం కవి చిరునామాకు తిలకం దిద్దుతుంది. సాహితీవేత్తల అభినందనల వెల్లువ కవి మదిని ముద్దాడి, మరో కవిత



సృజనకు ప్రార్థనాగీతాన్ని పాడుతుంది. ఇన్ని భావాల ఉత్పత్తికి ఆచార్య కడారు వీరారెడ్డి గారి కలం సృష్టించిన 'పల్లెకు పోదాం మళ్లీ' దీర్ఘ కవిత కారణమని వెల్లడించటానికి గర్వంగా ఎవరి భుజాలైనా ఎగురుతాయి. ఈ దీర్ఘ కవిత అందిస్తున్న విశేషాల పలకరింపుకు ఇదే అందరికీ ఆహ్వానం.

రసాయనశాస్త్ర ఉద్ధండులు వీరారెడ్డి గారు. కవిత్వం కూడా ఒక రసాయనశాస్త్రమేనని ఋజువు చేస్తూ ఒక నదీ ప్రవాహంలా సాగిన ఆయన దీర్ఘకవిత అధ్యాయాలలోకి అడుగులేసి ఒక్కసారి తల ఎత్తి చూస్తేచాలు, కనుచూపుమేర పొలాల పచ్చదనం. వీస్తున్న గాలిని ఆపి పలకరించాను. గట్టుమీద నన్ను కూర్చోపెట్టి వీరారెడ్డి గారి కవిత్వ పఠనానికి వేదికను సిద్ధం చేసింది. ప్రక్కనే కాలువలో పారుతున్న నీరు, తానూ వినటానికి సిద్ధంగా కాసేపు తన నడకను ఆపింది. చుట్టూ ఒక సాహిత్య సమ్మేళన పందిళ్లు,క్షణాల్లో వెలిశాయి. కాలం గడియారపు ముళ్లు కదలకుండా అభిరుచి తాళ్లతో బంధించాయి. ఇంతలో గొంతును సవరించుకుంటూ గాలి తరంగాలు కవితా గానాన్ని ఆరంభించాయి. వీరారెడ్డి గారు, తన కవిత్వాన్ని దుస్తులుగా తొడిగిన అంశాలన్నీ మనముందు హాజరు కోసం పోటీపడుతున్నాయి. రండి పలకరిద్దాం.

ఆ పల్లె పేరు స్వర్గం. ఊర్లో పుట్టినోళ్లు పెట్టుకున్న పేరు అది. మమకారానికి రెక్కలుంటే నేరుగా ఆ వూరిమీద వాలుతూ వుంటుంది. తపోవనాలు అడవుల్లోనే కాదు గ్రామాలలో సైతం దర్శనమిస్తాయని, కష్టజీవుల చెమట చుక్కలు చేసిన సాక్షి సంతకాలు అడుగడుగునా పలకరిస్తున్నాయి. గాంధీ వారసులకోసం వాడ, వాడలు వెతకనక్కరలేదు, మా పల్లెకురండి పరిచయం చేద్దాం... అంటూ పొలాలమీద ఎగిరే తూనీగలు రొద చేస్తున్నాయి. ఊర్లో ప్రతి ఇంటికీ ఒక గుర్తు, దానిపేరు చెట్టు. దానికి కొమ్మలు కాదు, చరిత్ర వ్రేలాడుతూ వుంటుంది. వాసాలు, పశువులతో చేసిన స్నేహం, మనతో కరచాలనానికి సిద్ధంగా వుంటాయి.. కవ్వం చిలికిన వెన్న, భోజనం వడ్డించిన కంచంలోకి అమృతంలా దూకి రుచికి ద్వారాలు తెరుస్తుంది. నిత్యం కళ్లాపి జల్లిన పల్లెవాకిళ్లు, పసుపు కుంకుమలతో సాంప్రదాయపు లోగిళ్లకు పట్టాభిషేకం చేస్తూవుంటాయి. చెట్టుక్రింద బడి, చూరు క్రింద కునుకు, రచ్చబండ చుట్టూ మంతనాలు. కాలుష్యానికి అనుమతిని నిరాకరించిన ఆ వూరి నేల మీద సాయంకాలం విన్యాసాలు చేసే ఎర్రటి గోధూళి కణాలు, పల్లె సహజ సౌందర్యానికి చిత్రపటాలు గీస్తూవుంటాయి. కొండల్లో, కోనల్లో, వాగుల్లో, వంకల్లో సంగీత విద్వాంసులకు సైతం సాధ్యకాని స్వరాలు, నీటి అలలమీద గల, గలల కచేరీలు చేస్తూవుంటాయి. చలికాలంలో చలిమంటలతో పోటీపడి, ఆకాశంలో సూర్యుడు ఓడిపోవటం కాలం దస్తావేజుల్లో నమోదుకాబడిన ఒక వాస్తవం.

పల్లెల్లో కురిసే కుండపోత వానతీరుకు అక్షరాలు జోడిస్తే అది ఒక మహా కావ్యమవుతుంది. వర్షంలో నడిచే కాళ్లను ముద్దాడుతున్న చిత్తడి, అమ్మలా ముద్దులు పెడుతుంది. వానతో నిండిన చెరువు, జల కళను, వొంటినిండా సింగారించుకుంటుంది. ప్రాణవాయువు దాతలైన పంటల పచ్చదనం, వీస్తున్న గాలితో రావాణాకు వొప్పంద సంతకాలు చేసుకుంటుంది.. ఎదురుచూసిన ఎండాకాలం, కొలిమి నిప్పులతో తన పాలనకు సిద్ధంగా తలపాగాను సవరించుకుంటుంది. పంట, కోతకు పచ్చాక కల్లాలనిండా, వజ్ర, వైడూర్యాలను వెక్కిరిస్తూ దినుసుల విలువల రాసులు దర్శనమిస్తాయి. గడ్డివాములు హంసతూలికా తల్పాలయ్యాక, వాటి మీద శయనించి పంటకు కాపాలాకాసే కర్షకుడి సేవకు ఆకాశంలోని మేఘాలు దరఖాస్తులు చేసుకుంటాయి. 'అన్నమో రామచంద్ర' ఈ మాట వినిపించని నేల విశ్వంలో నిస్సందేహంగా గ్రామాలు మాత్రమే. ఆకలికి తిండి దొరికే దారులు అడుగడుగునా అక్షయ పాత్రలతో వడ్డనకు సిద్ధం. కుటుంబ ఆర్థిక బలానికి మూలవస్తువుగా పండిన ధాన్యం, ఆదాయపు భరోసాలకు అధికారిక రాజముద్రికలవుతాయి. మాటకోసం ప్రాణాలివ్వటం గ్రామాల మనుషుల్లో ప్రహించే ఓ సరిక్రొత్త రక్తకణం. తలపాగాలనిండా నీతి, నిజాయితీల మగ్గం దారాలే దర్శనమిస్తాయి. మనిషిని మనిషిగా కొలిచే కొలతలకు నిలయాలుగా, తమ ఉనికిని ప్రకటించుకున్న పల్లెలు ఈ దీర్ఘకవిత నిండా మానవత్వానికి తిలకాలు దిద్దుతున్నాయి.

ఆరు దశాబ్దాలనాటి గ్రామీణ సజీవకతను ఆవిష్కరిస్తూ, ఋతువులు క్రమంతప్పని వాటి నడకలను నమోదు చేస్తూ, జేబులో పదిపైసలుంటే అపురూపమైన రోజులుగా చలామణి గాబడిన రోజుల్ని సగౌరవంగా పరిచయం చేస్తూ, పెళ్లికంటే, పండగనాడే మిన్నగా నిలిచిన భోజన వైభవానికి హారతులిస్తూ, మాష్టరు బెత్తం దెబ్బలు, తొడపాశాలు, పలకా, బలపం స్నేహాలు, తరగతిగది అల్లరి విన్యాసాలు, బడిగంటల మ్రోతలు, మైదానంలో ఆటల కసరత్తులు... ఇలా ఇలా అసంఖ్యాకమైన విషయాల సమాచారంతో ఆసక్తిగా సాగిన విశిష్ట రచన ఈ దీర్ఘకవిత. గ్రామాల తల్లి వొడిలో వోలలాడిన సాంప్రదాయ, సాంస్కృతిక, వినోద, మానవ సంబంధాలతో పాటు, పెళ్లి సంబరాలు, అర్థరాత్రి ముహూర్తాలు, ఊరేగింపులు, సాగనంపులు, జాతరలు, తిరునాళ్లు, జనం కోలాటాలు ఒక్కటేమిటి, శ్రమజీవుల పాదముద్రలతో పునీతమైన మట్టికణాల మీద పురుడు పోసుకున్న సమస్త విషయాలను తన సహజమైన శైలిలో, చలనచిత్రాన్ని తలపించే రీతిలో దృశ్యాలను దీటైన కవిత్వంలోకి తర్జుమా చేయటంలో కవి అనుసరించిన అసాధారణ సాహిత్య శిల్పం, పాలరాతి కట్టడాన్ని ఈ సందర్భంగా గుర్తుకు చేస్తోంది. పాఠకుడ్ని ఆ దృశ్యాలలో ఒక పాత్రధారుడ్ని చేసి కవిత్వాన్ని నడిపించటం కొందరికే సాధ్యం. ఆ కొందరిలో వీరారెడ్డిగారు ఒకరు కావటమన్న నిజాన్ని తెలుగు సాహిత్యం తప్పకుండా నమోదు చేసుకుంటుంది.

ఆచార్య కడారు వీరారెడ్డిగారి ఆలోచనా పరిధి, ఇంతటితోనే తన సరిహద్దుల్ని ప్రకటించుకోలేదు. వాస్తవాలను తెరకెక్కించటంలో సిద్ధహస్తులుగా నిరూపించుకున్న సందర్భాలకు ఈ దీర్ఘకవిత ఒక శ్వేతపత్రంలా నిలుస్తుంది. తన కళ్ల రెటీనామీద నిక్షిప్తం కాబడిన నిజాలను కవి ఇలా వెల్లడిస్తున్నారు. పల్లెల్లో వెలుగులే కాదు, గాఢమైన చీకట్లు సైతం తమ ఉనికికోసం బలమైన పునాదుల్ని ఏర్పరచుకుంటున్నాయి. లెక్కలేనన్ని దేవుళ్లు, దేవతలు, దయ్యాలు, భూతప్రేతాల భ్రమలు, శకునాలు, అపశకునాలు, అమాయకత్వాన్ని ఆవరించిన మూఢనమ్మకాలు... ఇలా ఎన్నో రుగ్మతలు ఒకదానితో మరొకటి పోటీపడి, గ్రామజీవన వ్యవస్థను నేలమట్టం చేయటంలో ప్రధానపాత్ర వహిస్తున్నాయి. వీటికి తోడు సనాతన ఆచార వ్యవహారాలు బూజు గదుల్లోకి శాశ్వతంగా ప్రజల్ని వెట్టివేస్తున్నాయి. ఒకప్పుడు పల్లెలకు మాత్రమే సొంతమయిన నిత్యకళ్యాణం, పచ్చతోరణం... ఈ మాటలు నేడు మరణశయ్యమీద గ్రామాలలో ఆఖరి శ్వాసకోసం ఎదురుచూస్తున్నాయి. దేశానికి వెన్నెముకల్లా కీర్తించబడిన గ్రామాలనిండా నేడు అన్నీ మిగిలిన ఎముకలే. అనారోగ్యం స్థావరాల నిండా దావఖానాలు కరువైన నేపథ్యంలో, రోగపీడిత జనాల ఆయువు నుదుటిరాతలు అర్థాంతరంగా రాలిపోతున్న దృశ్యాలు ఎన్నో. సమస్యల వలయంలో అభిమన్యుడిలా గాయాల పాలవుతున్న పల్లెల దుస్థితికి తన కంటతడితో కవి కలం రాసిన ఒక యథార్థ చిత్రపట సాహిత్యమిది.

కాలం మారింది. కాలుష్యం పెరిగింది. పొగగొట్టాల దండయాత్రలో అవయవాలను కోల్పోయిన గ్రామాలలో, మోడుబారిన చెట్ల స్వరూపాలను, శాశ్వతంగా ఎగిరిపోయిన పిట్టల రెక్కల ఈకల సాక్ష్యాలను, ఉనికిని కోల్పోయి, కాలగర్భంలో కలిసిపోతున్న పచ్చదనం అవశేషాలను, విషవాయువుల కౌగిళ్లతో, కాటికి దగ్గరవుతున్న తలరాతలను, పునాదులు చెదిరిపోయి, శ్మశానవాటిక ప్రతిబింబాలను మోస్తున్న నమూనాలను, పాఠకుల ముందు నమోదు చేయటానికి చేసిన ప్రయత్నమే ఈ దీర్ఘకవిత. నాడు దర్జాగా బ్రతికి న రైతును, నేడు పట్నంలో బికారిగా మార్చిన దోపిడీ వ్యవస్థను దోషిగా నిలబెట్టి ప్రశ్నించిన కవితా ప్రవాహమిది. పుట్టిన ఊరు, మట్టివాసనను వీడిన మనిషి బంధాన్ని నిజాల సిరాతో తెరకెక్కించిన వచనకవిత సాహితీ సంపద ఇది. విరామమే కాని, విరమణ ఎరుగని వెన్నెముకను అస్తిపంజరంగా మార్చిన వ్యవస్థ వికృత రూపాల్ని దోషిగా బోనులో నిలబెట్టి ప్రశ్నించిన పదచిత్రాల న్యాయస్థానమిది. ఈ దీర్ఘకవిత దేహంనిండా కవి తన జీవితంతో సహవాసం వేసిన సన్నివేశాలన్నింటినీ ఇజాలతో సంబంధంలేని నిజాల తలపాగాలతో కవిత్వపు చట్రంలో సమర్థవంతంగా బిగించటం కవి నేర్పరితనానికి, కవిత్వపు జెండాను ఆకాశం ఎత్తున ఎగురవేసినట్లుగా వుంది. భూస్థాపితమైనా సరే, రేపటి త్రవ్వకాలలో ఈ పురాతన సంస్కృతులు వెల్లడవుతాయన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా కవి ప్రకటించటం గమనార్హం. 'జై జన్మభూమి, జై జై పల్లెనేల' అంటూ గొంతెత్తి నినదించిన కవి కంఠస్వరాలలోని ధ్వనితరంగాలు నిరంతరం వినిపిస్తూనే వుంటాయి. కవి నిజాయితీపరమైన ఈ దీర్ఘకవిత ప్రయత్నానికి సాహితీలోకం యావత్తూ అభినందల వర్షాన్ని కురిపిస్తోంది. కదిలి, కదిలిస్తూ, ఆలోచింపజేస్తున్న ఆచార్య కడారు వీరారెడ్డి గారి కవిత్వం, ప్రేరణ పునాదులకు ఇకముందు కూడా ఒక ఉత్ప్రేరకంగా కొనసాగాలని ఆశిస్తూ....

ప్రతులకు:
ఆచార్య కడారు వీరారెడ్డి
సెల్: 7337058025

-డా. కె.జి. వేణు,
9848070084

నాకేందుకో ఇలా...!

చీకటి దుప్పట్లె కప్పేశాక
కనుల పొరల్లో చిక్కుకున్న
ఆశల కన్నీరంత
ఒక్కొక్కటొక్కటి రాలుతూ..
రేపటి జీవిత రూపాన్ని
కలగంటు కలల
రాతిరిలో మునిగిపోతున్నాను.
దేహానికే కునుకు..మనసుకు కాదు.
మదిలో గూడుకట్టుకున్న ఆశయాలన్నీ
బతుకుయుద్ధాన్ని తాళలేక...
నీటిఆవిరులై గాల్లో తేలిపోతున్నాయి.
ఏదో ఒక ఉహాలోకపు
ప్రయాణం సాగుతుంది.
నా అంతరంగపు
ప్రపంచాన్ని నన్ననేనే..
ప్రశ్నించుకుంటూ ప్రయాణిస్తున్నాను.

వేసవితాపమంత తనువును తాకుతూ..
కలల కాలువల్ని...
ఎండిపోయిన చేతబావుల్లా మార్చి
దుఃఖపు కన్నీటిపై ఎక్కి
కాలం సవారి చేస్తుంది.
లోలోని జ్ఞాపకాల తెరలన్నీ
ఆనందానికి.. బాధకు
మధ్య ఊగుసలాడుతూ మౌనముద్రలై..
హృదయపు కిటికీలనుతెరచి
తలదాచుకుంటున్నాయి
తీపిగుర్తుల్లా మిగిలిపోయిన
జ్ఞాపకాలతోనే..
ఇపుడు మాటా మంతి.
గడిచిన రోజుల్ని ఎంతని తలచుకోను?
కాలం మిగిల్చిన విషాదాన్ని ...
లయకరుడు కంఠంలో దాచినట్లు..
నా మదిలో ఎంతని దాచను.?
ముందున్నరోజులతోనే
ఇపుడు బతుకు యుద్ధమంత!

నేనందరిని ప్రేమిస్తున్నాను.
బతుకుపై వాలిన
నల్లని మబ్బులని తొలగించి..
రవికిరణాలై ఎదలో ఉదయిస్తున్నాను.
అమావాస్యలా అంధకారంలో చిక్కుకున్న
నావారందరిని...
చంద్రుడినై వెలుగుతూ
చీకట్లను చీల్చుతున్నాను.
మినుగురు పురుగులతో స్నేహం చేస్తూ..
నేనుకూడా ఒక మిణుగురు పురుగై
కరవాలాన్ని చేతిలో పట్టుకొని..
గాఢాంధకారంతో
యుద్ధంచేస్తూ నడిచేదారిలో
వెలుగునై నడుస్తున్నాను
మార్గదర్శిలా మారి
గమ్యాన్ని చూపెడుతున్నాను.

నా రెక్కలెప్పుడూ
ఇతరులకోసమే ఎగురుతుంటాయి
నా తనువెప్పుడు
ఇతరుల కోసమే చెమటను
నేలరాలుస్తుంటుంది.
నా కళ్లెప్పుడు ఇతరుల ముఖాల్లో
సంతోషాల
నవ్వులకోసమే చూస్తుంటాయి.
నా గొంతు ఎపుడు
పేదవారి పక్షమై వినిపిస్తుంది.
అయినా నాకెందుకో మరి..
దుఃఖమంతా సముద్రమై నిండుతుంది.!
నా కష్టాన్ని పలకరించ
ఒక్కరూ రారే..ఎందుకో!
బహుశా.. నేను
నాకోసం కాకుండా..
ఇతరుల కోసమే
బతుకుతున్నానని కావొచ్చు.!

-అశోక్ గోనె
9441317361

అదే వర్షం...!

వేకువల్లే
వేయి కలలు వెలిగించుకుని
తూరుపు కాంతులు పూసుకుని
చూపులులు మార్చుకున్న రోజులు
కళ్లపై వాలుతున్నాయ్ .

హాయిని గొలిపే ప్రపంచమంటే
కళ్ళలో వెలిగే దీపాలు
దారిచూపటం .
మనసున ఊగే భావాలు
ఊరించటం
అలరించటం అంతే కదా ...

వర్షాల ఊయల్లో
అలా ఊగిపోవటం
బంధాల్ని ముడిపెట్టుకోవటం కదూ...

ఇంతలా
వెన్నెల ఆకాశాన్ని వొంచి
తల నిమురుతూంటేనూ...
లోలోపల
జ్ఞాపకాలు తడుముతుంటేనూ...
ఏదో వెన్నెల వాకిలి
వొలికి చిలికి
నీ ప్రపంచాన్ని
తెరలు తీసి ప్రదర్శిస్తుంటేనూ
అదే వర్షం ....

నాపై వాలే చినుకుల్లో
నీ జ్ఞాపకాలు తడుపుతున్నాయి .

వాస్తవానికి జ్ఞాపకానికి
ఒక తీయని ఊహా లోకం లో
కొత్త ప్రపంచాన్ని
కళ్ళలో నిర్మిస్తాను

అర్థమౌతోందా
జీవితమంటే కన్నీళ్లే కాదు
కొన్ని కౌగిలించే జ్ఞాపకాలు కూడా .

-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

జన ధైర్య కవచం

కవిత్వానికి కత్తి ఆయుధం కాదు
కలం ఆయుధం.

కవికి సూర్యుడు ఆదర్శం
ఆయనే ఒక సూర్యుడు.

కవి సూర్య అస్తమయానికి వనకడు
చీకట్లో దీపం పెడతాడు.

కవి ఒక నక్షత్రం
చీకట్లో మెరుస్తాడు
అమావాస్య గుండెల్లో నిద్దుర పోతాడు.

కవి బాటలో ఎప్పుడు ముల్లె ఉంటాయి
కాలి బాటను రహదారిగా మారుస్తాడు

కవంటే చైతన్యం. రెపరెపలాడే పతాకం
కవికి సాటివ్వరు కవికి కవే సాటి.
సామాన్యుడిలా కనిపించవచ్చు
అసమాన్యుడు

అక్షరాలు కావవి
జీవిత భాష్యాలు
ఆలోచన
మదన పడిన క్షణాల్లోంచి పుడుతుంది

కవిత్వం
కవి కార్చిన హృదయ కన్నీటి బొట్లు

జనంలోంచి జనం కోసం
శ్రమ చెమటల మరో రూపం కవి.

చెడులోంచి మంచి కోసం
హితమార్గ స్వేచ్ఛ పథం కవి.

కవి ధైర్యం జనం
జన ధైర్య కవచం కవి

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

మణిపూసలు

కష్టాలను ఎదురించు
బాధేదైన భరించు
అలసత్వము వీడి ముందు
విజయాలను సాధించు

విద్య వల్ల ఎదగాలి
వినయంగా మెలగాలి
ఉన్నత శిఖరాలు చేరి
లక్ష్యమందు కోవాలి

బాధలకు భయపడకు
పట్టునెపుడు వీడకు
ఎన్ని బాధలున్నను
వెనకడుగులు వేయకు

ధనాశలను విడువుము
దురాశలకు పోకుము
ధర్మాన్ని నమ్ముకొని
ధన్యతలను పొందుము

డబ్బు డబ్బు అనువాడు
దెబ్బతిని తీరుతాడు
డబ్బు పిచ్చి లేకుంటే
దర్జాగ బ్రతుకు తాడు

దానాలన్నిటి కన్న
విద్యా దానమె మిన్న
కష్ట పడి విద్య నేర్చి
దాతవై వెలుగు మన్న

దుర్బుద్ధిని వీడుము
దుఃఖములను మరువుము
విద్యలను నేర్చుకొని
విజయాలను పొందుము

కనిపించే దేవుడు
కడుపు నింపె దేవుడు
జగానికి కూడు బెట్టు
తను నిత్య దరిద్రుడు !!

-వై.గణేష్, 10వ,తరగతి

బాధ పడకు

అందం లేదని బాధపడకు
"ఆరోగ్యంగా" ఉన్నందుకు
ఆనందించు
ఆస్తులు లేవని బాధపడకు
"ఆదరణ" వున్నందుకు ఆనందించు
గుర్తింపు లేదని బాధపడకు
"గౌరవము" ఉన్నందుకు ఆనందించు
సమస్యలు ఉన్నందుకు బాధపడకు
"సంకల్పం "ఉన్నందుకు ఆనందించు
సంపద లేదని బాధపడకు
"సంస్కారం "ఉన్నందుకు ఆనందించు
అధికారం లేదని బాధపడకు
"అదుకునే తత్వం "ఉన్నందుకు
ఆనందించు
పలుకుబడి లేదని బాధపడకు
"ప్రేమ గుణం" ఉన్నందుకు
ఆనందించు
ఆత్మీయులు లేరని బాధపడకు
"అనుంగు మిత్రులు" ఉన్నందుకు
ఆనందించు
బలహీనున్ని అని బాధపడకు
"మనోబలం "ఉన్నందుకు
ఆనందించు
బంధువులు లేరని బాధపడకు
"భగవంతుడు" అండగా ఉన్నాడని
ఆనందించు
మరుపు ఉన్నందుకు బాధపడకు
మరుపే నీ జీవితములో "మార్పు "
ఐనయిందుకు ఆనందించు
మణులు మాన్యాలు లేవని
బాధపడకు
"మమత 'మానవీయత" ఉన్నందుకు
ఆనందించు
హంగు ఆర్భాటం లేదని బాధపడకు
"దయార్ద్ర హృదయం" ఉన్నందుకు
ఆనందించు.
చీకటిని తిడుతూ బాధపడకు
"చిరుదివ్వెను" వెలిగించి ఆనందించు
ఆంధోళన ఉన్నందుకు బాధపడకు
"మనోధైర్యం" ఉన్నందుకు
ఆనందించు

-నేదునూరి కనకయ్య
9440245771

ఆమె కంటిలో సముద్రమే బొట్టు!

ఆయన సముద్రం
ఆమె నది
సాగరసంగమమే సంసారం
ఆనందంగాజీవించడమే జీవిత సారం
భార్యాభర్తలు
బ్రహ్మ సృష్టి కర్తలు
తోడునీడలకు అనాది సత్యం
ఆలుమగల అన్యోన్య దాంపత్యం
పిల్లాపాపలతో వెల్తీలేని ఆమెజీవితం
అనురాగానికే అంకితం
హాయి రాగం
ఆమె కాపురం
ఇంటినిండా మెరుపుదీపాలు
ఖరీదైన సోఫాలు
తళతళల కిటికీ అద్దాలు
కళకళలాడే ఇంటీరియర్ అందాలు
ఆహా! కలల సౌధం
ఇహ తీరా చూస్తే
అంతెరుగని అప్పుల అగాధం
నిభాయించ చేవలేదు
వచించే మనసుకాదు
కొడుకులు కోడళ్ళు
మాటలవేట కొడవళ్ళు
పెనిమిటి రాబడికి మించింది అప్పు
తెలియక చేసిందీ తప్పు
జీవితాన్ని ముంచు అప్పొక ఊబి
నిరాశ దాని నాభి
అంతా నిరాశమయం
గుండెలో ధైర్యం చెడిన భయం
అదిసంధ్యా సమయం !
అలజడుల హృదయం లో
దాపురించిదో దరిద్రపుభావం
ఊరి చివరిచెరువులో తేలిందో శవం
ఊసులన్నీకదలాడే గాలి అలలు
కల్లలైనవిపుడు ఆమె కలలు
రాలింది ఆమె బొట్టు
ఇగ ఆమెకంటిలో సముద్రమే బొట్టు
కలలుగని కట్టుకున్న ఇల్లు
కడకు మిగిల్చింది కన్నీళ్ళు
ఈ శోకం ఎవ్వరిది?
ఈ గాయానికి మందేది?

-రమేశ్ నల్లగొండ
8309452179

వలస పోయిన బ్రతుకు

కన్న ఊరు వదిలి ఆత్మీయులను వదిలి
అన్నదమ్ములను వదిలి

బాల్య స్నేహితులను వదిలి
తను నడిచిన బాటల
పాదాలను మరిచి

తిన్న తినకపోయినా కన్న ఊరిలో
నీ ప్రేమలు మరిచి
అమ్మ నాన్నను వృద్ధులను మరిచి

జీవితంలో తగిలిన
దెబ్బలను తలచుకుంటూ
పిడికెడు మెతుకుల కోసం

పట్నం నడిరోడ్డులో
అడ్డా కూలిగా మారి
పగలనకా రేయి శ్రమిస్తూ

జీవితానికి ఒక ఆశయంతో ఆదర్శంతో
కూడు గూడు గుడ్డ కోసం
ఏ సంరక్షణ లేని
ఏ భీమా లేని
మనిషి అంటే ఎవరో కాదు వలస కూలి

అతడు వలస కూలి బ్రతుకులోని బాధలన్నీ
పంటి బిగువన పట్టి

సాగిపోతున్న అతని హృదయానికి తెలుసు
పట్నంలో ఎవరు అతని కానేవారు లేరు

అతడే వలస కూలి అదే
అతని బ్రతికే పట్నంలో కూలీ నాలి

కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది
అతని బ్రతుకు దృశ్యం
కంటిలోని చెమ్మ
కన్నీళ్లు పెట్టిస్తుంది అతని బ్రతుకు దృశ్యం

-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

ఒక్కసారి మనం కలుసుకోవాలి మిత్రమా...

ఒక్కసారి మనం కలుసుకోవాలి మిత్రమా.
అవిరామంగా తిరుగుతూనే ఉంది కాలచక్రం
.ప్రాణం లేని ఆ యంత్రం
మరపు మంత్రం ఎలా వేస్తుందో
దాని మర్మమేమిటో దొరకబట్టాలి మిత్రమా...
మానిన గాయాన్ని పనికట్టుకుని మరీ కెలుకుతుంటది.
మనిషి ని తోలుబొమ్మ ను జేసి ఆడిస్తది.
మనసు ను కోతి నీ జేసి తమాషా జూస్తది.
దీని కథ ఏన్దోకనుక్కోవాలి మిత్రమా...
కనిపించని ఊచలను లెక్కిస్తూగడియ గడిస్తే
చాలనుకుంటే గడియారం లోని
ముళ్ళు తోడెల్లె వెంటాడుతున్నాయి.
ఈ గడియారం గానుగ నుఆపేదెలా మిత్రమా...
మనసు లోని కోర్కెలు కొండెక్కవు కానీ...
ఆశఆరాటపు వల విసురుతానే వుంటది.
జీవితపు తక్కెడ లోరాయి ఏ పక్కన బెట్టినా
పాసంగం మన వైపే ఎందుకు వుంటదో
కొంచెం ఆలోచన జెయ్యాలి మిత్రమా...
కట్ పతంగి లెక్కపగలంతా ఎంత దిరిగినా
పొద్దుగూకేటాళ్ళ కు గూటికి జేరాల.
నాలుగు గోడల మధ్య నలుగుతూనే ...
మనదైనసామ్రాజ్యాన్ని కలగంటాం.
కాళ్ళు సాపితెనే గదా హద్దులు తెలిసేది.
చేతులు కొంచెం లేపితే సాలు ఆకాశం తగుల్తోంది.
కనబడని కంచెల మధ్య మనసెప్పుడో బంధీ అయ్యింది.
జీవితమంతా పనుగడ లేని పెరడు అయ్యింది.
మనం ఒక్కసారి కలుసుకోవాలి మిత్రమా...
మొహమాటం పొరలు ఒక్కటొక్కటిగా ఒలిచేసి
మనసు విప్పి మాట్లాడుకోవాలి.
మళ్ళీ కలుస్తామో లేదోభుజాల మీది
బరువు మూటలను దింపి
ఒక్కసారి చల్లగాలి పాడే ఈల పాట వినాలి.
రాలిన ఆకుల్లో మన నీడ చూసుకోవాలి.
మనం వస్తామని ముందే ఎలా తెలిసిందో...
నిశీధి కళ్ళకు చీకటి కాటుక పులుముకున్నది.
వేచి చూద్దాం మిత్రమా.
వెలుతురు రేఖలు విచ్చుకోకపోతాయా.
కన్నీళ్లు ఎందుకు ఊప్పగుంటాయో ,
వాస్తవాలు అంత చేదుగెందుకుంటాయో
ఎవరైనా బయాప్సీ చేసి చెబితే బాగుండేది.
గుండె కదా కొట్టుకోవాలి,
ఈఇదేమిటి కొత్తగా మనసు కొట్టుకుంటోది.
పాత గాయాలు ఇంకా మాననేలేదు.
మళ్ళీ యుద్ధం అనివార్యమైంది.
కన్నీటి జలపాతాల మధ్యబండరాళ్లు కూడా మొలుస్తాయి.
కరిగిపోనివ్వనికటినత్వమేదో
వాటి గుండెకు రాసుకొని ఉండాలి.
ముసుగేసుకున్న మనుషుల మధ్య తిరుగుతూ
ఎవరేమి టో తెలియక మనమూ ముసుగేసుకున్నాం.
ఈ ముసుగు ల నాటకాలేమిటో
కాస్త తెర తీసి చూడాలి మిత్రమా..
.కుళ్ళిన సమాజం ఎప్పటిలాగానే
ఎంబామింగ్ చేసుకొని మేడిపండు లా
నిగనిగలాడే పడుచు పిల్ల అయ్యింది.
తప్పదు మిత్రమా.
పొట్టవిప్పి చూస్తే పురుగులుంటాయని తెలిసినా
తెలియనట్టు నటిద్దాం.
మనం ఒకసారి కలుసుకోవాలి మిత్రమా.
తుమ్మకొమ్మ కు వేళ్ళాడుతున్న పిట్టగూళ్ళం మనం.
ఏ గాలివాన కు ఆగమైపోతమో ఏమో...
మనకిప్పుడు సముద్రాల లోతులతో పని లేదు మిత్రమా..
.మనసు లోతుల్లో మూడు మునకలెద్దాం
.చాలు.
మనం పదిలపరుచుకున్న కొన్ని జ్ఞాపకాలను
అవి శిలాఫలకాలు గా మారకముందే ...
మన కాళ్ళను కనిపించని
కళ్ళాలు కబలించకముందే
మనం కలుసుకోవాలి మిత్రమా...

-పొద్దుటూరి మాధవీలత
9030573354.

అవ్వ - కాకి - చికెన్ బర్గర్ (కథ)

"తాతయ్యా ...తాతయ్యా, ఎప్పుడూ అవ్వ వడ కాల్చడం కాకి ఎత్తుకు పోవడం ... అవ్వకు బర్గర్ చేయడం తెలిదా"

"ఔనా ఈ రోజు కథలో అవ్వకు ఆరోగ్యం బాగోలేక పిండి రుబ్బలేదు. సాయంత్రం వచ్చే పిల్లలకు కష్టపడకుండా ఏదో ఒకటి చేయాలనుకొంది. ఆలోచించి చికెన్ బర్గర్ చేయాలనుకోంది." అన్నాడు తాతయ్య.

ఆ మాట వినగానే పిల్లలందరూ "హాయ్ " అంటూ సంతోషంతో అరిచారు.

"అవ్వ అంగడి కెళ్ళి బన్ను కొనింది. కోడిమాంసం కొని తాయారు చేసే

బతుకంతా మోసమేనా..!

తొవ్వ చూపినోడికె
గోతులు తవ్వుతున్నరు..!
బువ్వ పెట్టినోడినె
బూడిద చేస్తున్నరు..!!

నీతిగా వున్నోడినె
నిలువునా కూల్చుతున్నరు..!
న్యాయం చేసినోడినె
నట్టేట ముంచుతున్నరు..!!

మనల చూసి నవ్వినోడికె
వంతా పాడుతున్నరు..!
వెన్నుపోటు పొడిచినోడికె
వెన్నుదన్నుగా వుంటున్నరు..!!

లంచం తీసుకున్నోడికె
కంచం అందిస్తున్నరు..!
లుచ్చా పనులు చేసినోడికె
మంచం వేస్తున్నరు..!!

మందు,మాంసములకు
బానిసలైరి నేటి వారు.!
కష్టం చేయకుండనే
కడుపు నిండాలని చూస్తున్నరు..!!

శ్రమతత్వం మరిచి
చవటలయ్యింద్రు మూర్ఖులు..!
అసలుతత్వము విడిచి
అమ్ముడుపోయింద్రు సన్నాసులు..!!

–పసుల.శంకర్
9542181301

గజల్

కన్నవారి ఉన్నతికోసం..తపించేవాడు నాన్నంటే
కలనైనా బిడ్డలకోసం..యోచించేవాడు నాన్నంటే

బడబాగ్ని తనలోవున్నా..చల్లని సంద్రంలా వుంటాడు
బాధలెన్నో తనలోవున్నా..దాచేసేవాడు నాన్నంటే

తనపిల్లల సౌఖ్యం కోసం..కొండనైనా పిండిచేస్తాడు
పిల్లల సంతోషమే స్వర్గమనీ..తలచేవాడు నాన్నంటే

నీ భవితకై నిరంతర తపన..నిను శిఖరానికి చేర్చేనిచ్చెన
నీకోసం తన ఆయువునైనా..ఇచ్చేవాడు నాన్నంటే

ఇంటికోసం సర్వస్వము..ధారపోసే త్యాగధనుడు
క్రొవ్వొత్తిలా దేవా వెలుగునిచ్చి..కరిగేవాడు నాన్నంటే

– బూర దేవానందం
8143589789

విచిత్రం

సృష్టిలో ఎన్నో విచిత్రాలు....
ఆలోచనల్లోనూ విచిత్రమే.....

ఎక్కడో జరిగిన సంఘటనల గూర్చి
సలహాలిస్తుంటాము
అక్కడి పరిస్థితి తెలీకుండానే.....
పాటించరు...
పాటించలేరని తెలిసినా
చేలో పడ్డ గుడ్డెద్దులా

మనసుదీ అంతే....
జరుగవని తెలిసినా...
తీరవని తెలిసినా...
ఊహల మేఘాల తేరుపై
ఊరేగుతుంది పిచ్చిగా.....
శూన్యాకాశంలో
చిత్రకారుడు వేసిన చిత్రాల్లా
రంగుల కలలు కంటుంది వెర్రిగా....
జరుగని నాడు పిచ్చిదవుతుంది.....

వైజ్ఞానిక ఆవిష్కరణలే
ఒక విచిత్రం....

పంచ భూతాత్మికమైన
దేహ నిర్మాణమే విచిత్రం
మానవ మేధస్సు మరీ విచిత్రం.

చిత్ర విచిత్రాల మధ్య
మానవ జీవితమే విచిత్రం

–జి. మధు మురళి
భీమారం
హన్మకొండ

మంచి గుణం (కథ)

ధర్మయ్య ప్రతి పండుగకు ముగ్గురు బీద విద్యార్థులకు కొంత ఆర్థిక సహాయాన్ని అందించేవాడు. అంతే కాకుండా వారికి కథల పుస్తకాలు, నోటు పుస్తకాలు బహుమతిగా ఇచ్చేవాడు. ఈసారి పండుగకు కూడా సాయం చేయదలచి పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయునితో ముగ్గురు పేద విద్యార్థులను తన ఇంటికి ఉదయం తొమ్మిది గంటల లోపుగా పంపమని చెప్పాడు. ప్రధానోపాధ్యాయుడు సరేనని బీద విద్యార్థులైన రాము, ఆనంద్ ,సురేష్ లకు ఉదయం తొమ్మిది గంటల వరకే ధర్మయ్య ఇంటికి వెళ్ళమన్నాడు. అతడు వారికి ఏదో సాయాన్ని చేస్తాడని చెప్పాడు. ప్రధానోపాధ్యాయుని మాటలకు వారు ముగ్గురు సరేనన్నారు. వారి ఇండ్లు చాలా దూర దూరంగా ఉండటం వల్ల విడివిడిగా ఎవరికి వారే వెళదామని అనుకున్నారు .

సరిగ్గా తొమ్మిది గంటల ఐదు నిమిషాలకు ఆనంద్ వెళ్లి ధర్మయ్యను కలిశాడు. ధర్మయ్య అతనిని వేచి ఉండమన్నాడు. ఇంతలో ఒక వృద్ధుడు వచ్చి తనకు ఆసరాగా వచ్చి ఇంటివరకు చేర్చాలని ధర్మయ్యను కోరాడు. అప్పుడు ధర్మయ్య ఆనంద్ ను వెళ్లమన్నాడు. ఆనంద్ ఆ తర్వాత వెళతానని అన్నాడు. కానీ వెళ్లలేదు. ఇంతలో అతని బంధువులు వచ్చి ఆ వృద్ధుని తీసుకుని వెళ్లారు. ఆ తర్వాత తొమ్మిదిన్నరకు అంటే అరగంట ఆలస్యంగా సురేష్ అక్కడికి వచ్చాడు. సురేష్ వచ్చిన తర్వాత మరొక స్త్రీ వచ్చి తన సరకుల మూటను ఇంట్లో పెట్టమని సురేష్ ను కోరింది. సురేష్ అందుకు నిరాకరించాడు. ఆ తర్వాత ఆమె అక్కడి నుండి వెళ్లి పోయింది. ఆ తర్వాత అరగంటకు అనగా పది గంటలకు రాము వచ్చాడు. వెంటనే ధర్మయ్య "చూడండీ! మీరు చిన్న పిల్లలు. సమయపాలన సరిగా పాటించాలి. ఈ సురేష్ సమయపాలన పాటించలేదు .ఆనంద్ కూడా ఒక ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా సురేష్ కన్నా నయమే. అతడు ఇంకాస్త ముందుగానే వచ్చి ఉంటే బాగుండేది "అని అన్నాడు. ఆ తర్వాత అతడు పదిహేను నోటు పుస్తకాలను,పదిహేను కథా పుస్తకాలను, పదిహేను వందల రూపాయలను రాముకు ఇచ్చి "రామూ! ఇవన్నీ నీకే తీసుకో" అని అన్నాడు. అది చూసిన ఆనంద్ " అయ్యా! వీరిద్దరూ సమయపాలన పాటించలేదు .ఈ రాము అందరికన్నా ఆలస్యంగా వచ్చాడు. ఇతనికే మీరు బహుమతిగా ఈ పదిహేను నోటు పుస్తకాలను, పదిహేను కథా పుస్తకాలను , పదిహేను వందల రూపాయలను ఇచ్చారు .ఇది న్యాయమా!" అని ప్రశ్నించాడు? వెంటనే సురేష్ కూడా "అవును సార్! మీరా కానుకను వాస్తవంగా ఒక ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అందరికన్నా ముందు వచ్చిన ఆనంద్ కే ఇవ్వాలి. సమయపాలన మా ఇద్దరి కన్నా కొద్దిగా ఆలస్యమైనా అతడే చక్కగా పాటించాడు .అందరికన్నా ఆలస్యంగా వచ్చిన రాముకు మీరు ఈ పుస్తకాలు, డబ్బులు మొత్తానికి మొత్తం ఇవ్వడం ధర్మం కాదు కదా! ఇంత పెద్ద మనుషులై ఉండి మీరు మాకు అన్యాయం చేస్తారా! మీరే చెప్పండి "అని అన్నాడు.

అప్పుడు ధర్మయ్య "ఒరేయ్! మీకు నిజం తెలిస్తే అలా మాట్లాడరు. ఎందుకంటే రాము ఉదయం ఎనిమిది గంటలకే మా ఇంటికి మీ అందరికన్నా ముందుగా వచ్చాడు. ఇంతలో ఒక బాలుడు ఏడుస్తూ వచ్చి తన అమ్మ రోడ్డుపైన స్పృహదారిపై పడిపోయిందని ఆమెను ఇంటికి చేర్చాలని నన్ను కోరాడు. కానీ నేను వృద్ధాప్యం వల్ల వెళ్లలేను. నా చేతులు ఆమె బరువును మోయలేవు. అందువల్ల ఈ రామును కాస్త సాయం పట్టి వారి ఇంటిలో చేర్చమని అవసరమైతే ఇతరుల సాయం కూడా తీసుకోమని నేనే పంపాను. అతడు మీ ఇద్దరి కన్నా ముందుగానే వచ్చాడు. పైగా నేను చెప్పగానే తడుముకోకుండా వెంటనే వెళ్లి ఆ సాయం చేసి తిరిగి వచ్చాడు. మీరు సాయం చేయమని ఇతరులు అడిగితే వారి మాటలనే కాకుండా చివరికి నా మాటలను కూడా తిరస్కరించారు. అతడు సమయపాలన పాటించడమే కాకుండా పెద్దవారి మాటలను శిరోధార్యంగా భావించి ఆమెకు ఆ సాయం చేసి మరీ వచ్చాడు. ఇప్పుడు చెప్పండి. నేను మీకు అన్యాయం చేశానా! సమయపాలన పాటించిన రాముకు ఆ మొత్తం పుస్తకాలను,డబ్బులను ఇవ్వడం తప్పా! మీరే చెప్పండి" అని అన్నాడు.

ఆయన మాటలు విన్న ఆనంద్ ,సురేష్ తలదించుకొని తమకు రాము సమయానికన్నా ముందు రావడమే కాకుండా సాయం చేసిన సంగతి కూడా తెలియదనీ, అందువల్లనే అలా మాట్లాడామని తెలిపారు. తమను మన్నించమని కోరారు. అప్పుడు రాము" అయ్యా! దయచేసి మీరు ఇచ్చిన ఈ పదిహేను నోటు పుస్తకాలు,పదిహేను కథా పుస్తకాలు, పదిహేను వందల రూపాయలు ఒక్కొక్కరం తలా ఐదు నోటు పుస్తకాలను,తలా ఐదు కథా పుస్తకాలను ,తలా ఐదువందల రూపాయలను తీసుకుంటామండీ! నా సహచరులు కూడా పేదవారే. మీరు దయచేసి అందుకు అనుమతించండి" అని కోరాడు. అప్పుడు ధర్మయ్య "చూశారా రాము మంచితనం. మీరు అతనికి ఆ కానుకను ఎందుకు ఇచ్చారు అని అడిగితే అతడు మీతో వాదించకుండా తనకు వచ్చిన ఈ కానుకలను అందరికీ పంచుతానని అంటున్నాడు "అని అన్నాడు .వెంటనే రాము ఆ పుస్తకాలను,డబ్బును మిగతా ఇద్దరికీ పంచాడు. రాము మంచి గుణాన్ని వారు కూడా కీర్తించి మరోసారి రాము అడుగుజాడల్లో నడవాలని,సమయపాలనను , సేవా గుణాన్ని అలవరచుకోవాలని అనుకున్నారు. వారి మాటలు విని ధర్మయ్య ఎంతో సంతోషించాడు.

–సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

కృషికి నిలువెత్తు నిర్వచనం 'దువ్వూరి'

''దండము శాస్త్రధీమతికిన్ దండము కావ్య కళావిభూతికిన్" ఈ పద్య పాదం ఒక్కటే మిగతా మూడు పాదాలు ఎవ్వరూ రాయలేదు. ఇదొక విచిత్ర సంఘటన. ఒక గ్రంథాల యం లో ఒక శతావధాని చుట్టూ కొంత మంది యువకులు చేరివున్నారు. అందులో కొందరు కవిత్వం ఎలా రాయాలని ఆ పండితున్ని ప్రశ్నిస్తు న్నారు. సమాధానంగా అతడు ఇలా అన్నాడు. కవిత్వం మీరనుకున్నంత సులభం కాదు. అది జన్మ సంస్కారం వలన వస్తుంది. అందరూ రాయ లేరు' అని. పాపం ఆ యవకులు నిరుత్సాహ పడిపోయారు. ఇదంతా ఓ మూల కూర్చొని వింటున్న 19 ఏళ్ళ యువకుడు నేరుగా ఆ పండితుని దగ్గరకు వచ్చి 'మీరు చెప్పింది నిజం కాదు. పట్టుదల, కృషి వుంటే ఎవరైనా కవిత్వం రాయవచ్చు. అని ఏవేవో వాగుతున్న ఆ యువకుని చూసి అవ ధానికి కోపం వచ్చింది. నన్నే అవమా నిస్తాడా అన్న ఆక్రోషంతో. 'ఇన్నిమాట లంటున్నావు నీవు రాసి చూపించు చేతనైతే. ధాంబికాలెం దుకూ అని కోప్పడ్డాడు. ఆ కుర్రాడికి నిజానికి ఏమి రాదు. బెంబేలెత్తి పోయాడు. నోట మాట రాలేదు. అవమానమనిపించి ఒక మూలకు వెళ్ళి పోయి ఎలాగైనా పద్యం రాయాలని భీష్మించుకొని తను చిన్నప్పుడు చదువుకున్న గజేంద్ర మోక్షం, రుక్మిణీ కళ్యాణం లాంటివి గుర్తుకుదెచ్చుకొని నానా తిప్పలు పడి పట్టుదల విడవకుండా పై ఒక్క పా దాన్ని రాసి ఆ పండితునికి చూపించా డా పిల్లవాడు. అది చదివిన అవ ధాని అవాక్కయ్యాడు. ఆ పాదంలో వున్న పద లాలిత్యం, శబ్దసౌమ్యత పండితున్ని ఆశ్చర్య పరిచాయి. వెంటనే ఆ అబ్బాయిని కౌగిలించుకుని నీవు బాగా ప్రయ త్నించు భవిష్యత్తు లో గొప్ప కవిగా రాణించ గలవు అని ఆశీస్సులు అందించారు ఆ అవధాని. అదే సాధనా మంత్రమై భవిష్యకా లంలో గొప్పకవిని చేసింది. ఆ కుర్రాడు ఎవరో కాదు 'కవి కోకిల' దువ్వూరి రామిరెడ్డి. ఇంతకూ అతడు చదివింది 8వ తరగతి మాత్రమే. అతడే అత్యల్పకాలంలో నమ్మసఖ్యం కానంత ఉన్నత శిఖరాలను అందు కొని తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తినార్జించి పెట్టినాడు. దువ్వూరి రామిరెడ్డి నెల్లూరు జిల్లాలోని గూడూ రు సమీపం లోని పెమ్మ పాలెం లో 09 నవంబర్ 1895 న వ్యవసాయ కుటుంబం లో జన్మించారు. అందుకే వ్యవసాయ వ్యవహారం కూడా కొంత కాలం చూసుకొన్నాడు. దాని ఫలితమే 1924 లో 'కృషీవలుడు ' పద్యకావ్య రచన. ఇది రైతు జీవనాన్ని వ్యవ సాయ స్థితిగతులను, తెలియజేసే కృషి ప్రధానమైన మొట్టమొదటి పద్యకావ్యం. అదే ఏడాది సరస్వతీ భాండారము వారిచే కొన్ని పదాలు సవరించి మరికొన్ని కొత్త పదాలను కూర్చి ద్వితీయ ముద్రణ గా ప్రచురింపబడింది. ఈ కావ్యాన్ని తన మిత్రుడైన మన్నెము శేషురెడ్డి కీ అంకితమిచ్చాడు. ఇదే కావ్యానికి ప్రముఖ విమర్శకులు కట్టమంచి రామలింగా రెడ్డి గారు గొప్ప ఉ పోద్ఘాతము వ్రాసినారు. తన 19 వ ఏట నే ఆరంభించిన కవితా వ్యాసంగము అనేకానేక మలుపులు తిరిగి తెలుగు సాహితీ రంగాన్నే గాక ఇతర భాషల అనువాద సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేశాయి దువ్వూరి రచనలు. వాటి వివరాలు కొన్ని ఉ దహరించుకొనడం సమంజసం. దీని ముందు దువ్వూరి రామిరెడ్డి గారు జన్మించిన 1895 సంవత్సర ప్రత్యేకతను తెలుసుకోవాలి.. అది ఏమంటే ఉద్ధండులైన సాహితీవేత్తలు, అఖండ ఖ్యాతినార్జించిన మహాకవులు గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, నండూరి సుబ్బారావు, అడవి బావిరాజు వంటి వారికి ఈ సంవత్సరమే జన్మనిచ్చింది. అందులో దువ్వూరి కూడ కలిసి వుండడం విశేషమే. ఎంతో పట్టుదలతో చందో లక్షణాలను, తెలుగు వ్యాకరణాది పుస్తకాలను అహర్నిశలు చదివి సాహిత్యమే ఊపిరిగా జేసుకొని చక్కటి ప్రణాళికాబద్ధతను సృజించుకొని చిన్నవయసులోనే అసామాన్య రచనలు చేశారు దువ్వూరి. 1917లో తన 22 వ ఏటనే డా. కట్టమంచి రామలింగారెడ్డి గారి చేతులమీదుగా స్వర్ణకంకణం బహుకరింపబడింది. 1918 లో తన కావ్యం ' వన కుమారి' కి విజయనగర ఆస్థానంలో ప్రథమస్థానం పొంది 4 వందల రూపాయలు బహుమానం లభిం చింది. విజయవాడ ఆంధ్రమహా సభ లో వీరికి 1929 న అత్యుత్తమ బిరుదు ' కవి కోకిల' వచ్చింది. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో రచించిన ' మాతృశతకం' లోని ప్రతి పద్యమూ అగ్నిమాల గా మారి బ్రిటిష్ ప్రభుత్వ కంఠానికి చుట్టుకుని నిషేధానికి గురైంది. వీరి రచనలో నలజారమ్మ, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన

చదివింది 8వ తరగతి మాత్రమే. అతడే అత్యల్పకాలంలో నమ్మసఖ్యం కానంత ఉన్నత శిఖరాలను అందుకొని తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తినార్జించి పెట్టినాడు.

పద్యకావ్యములు నక్షత్రశాల, నైవేద్యములు అనే ఖండ కావ్యాలు , కవిత్వతత్వ నిరూపణము వ్యాసాలు సీతా వనవాసము లాంటి నాటకాలూ మరెన్నో అద్భుత రచనలు చేశారు. ఇక వారి అనువాదముల ప్రస్తావనకు వస్తే బహుభాషాకోవిదులు . ఆంగ్లం , పారసీకం, అరబ్ ఉర్దూ , ఫ్రెంచ్ భాషలలో నైపుణ్యం సంపాదించి అనేక అనువాదాలు చేశారు. తన రచనలనే కొన్ని సంగ్రహించి వాటిని ఆంగ్లములోకి అనువదించి voice of the read ' గా ప్రచురించాడు. సుప్రసిద్ధ పారసీక కవి ఉమర్ ఖయ్యామ్ (1048---1123) రచించిన 'రుబాయిత్' లను తెలుగు లోనికి అనువదించారు దువ్వూరి. వీటిని Edward Fitz gerald అనే కవి ఆంగ్లంలోకి అనువదించిన రుబాయిత్ లు అఖండ జనాదరణ పొంది లక్షల ప్రతులు అమ్ముడు పోయాయని వాటిని తెలుగులోకి ''పానశాల'' గా అనువంచాడు దువ్వూరి. ఇది దువ్వూరికి ఖ్యాతి నార్జించిపెట్టింది. ఈ పద్యకావ్య రచనా కాలం 1926. అయినా 1928 భారతి లో ప్రచురింపబడింది. ఆ తరువాత 1934 ప్రాంతం లో ' పానశాల' పుస్తక రూపం సంతరించుకున్నది. 34 పేజీల ఉపోద్ఘాతము ను వ్రాసి జత పరచారు దువ్వూరి ఈ పుస్తకానికి. ఇందులో పారశీక సాహిత్యచరిత్రను పాఠకులకు పరిచయం చేసి కావ్యం సులభంగా అర్థమయ్యేటట్లు చేశారు కవి. అందువల్ల 'పానశాలలి కావ్యం అనువాదమనిపించదు. ఇది మూల భాష రచనే అనిపిస్తుంది. పైగా ఇది స్వేచ్ఛానువాదం. దువ్వూరి రామిరెడ్డి గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కేవలం సాహిత్యమే గాక శాస్త్ర పరిశోధనలలో దిట్ట. డ్రై బాటరీలతో రేడియో సెట్లను తయారు చేసేవాడు అనేక పరికరాలను ముడిసరుకుతో ఉ త్పత్తి చేసి అందరినీ ఆశ్చర్యపరచే వాడు. ఇవి మాత్రమే గాక సినిరంగ ప్రవేశం జేసి అనేక సినిమాలకు మాటలు పాటలు రాయడమే గాక ' చిత్రనళీయం' అనే సినిమా కు దర్శకత్వం వహించి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్నారు రామిరెడ్డి. ఇటీవలే వారి జ్ఞాపకార్థం పోస్టల్ కవరును ప్రవేశపెట్టింది ప్రభుత్వం. తనకు గల శాస్త్రీయ పరిశోధన మీద మక్కువ తో తన మరణా నంతరం కూడా ప్రోత్సహించడానికి ఒక ట్రస్టు ను ఏర్పాటు చేసి ప్రతి ఏడాది ఇద్దరు ప్రతిభావంతులకు నగదు బహుమతిని అందించారు. వారిని చిరకాలం స్మరణకు తెచ్చే 'పానశాల' లోని ఒక పద్యం మనమిక్కడ స్మరించుకోవడం సముచితం. "అంతములేని ఈ భువనమంత పురాతన పాంథశాల./ విశ్రాంతి గృహంబు అందు ఇరుసంధ్యలు రంగుల వాకిలుల్ / ధరాక్రాంతులు , పాదుషాలు బహరామ్ జమిషీదులు /వేనవేలుగా కొంత సుఖించి పోయిరెటకో పెరవారికి చోటొసంగు చున్....

(కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి నవంబర్ 9 జయంతి సందర్భంగా)

–మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603.

తడియారని జీవనదులవి..!

నిన్న మొన్నటి దాకా అవి
పాడుబడిన శిథిలాల్లా
బెంగటిల్లిన పసిపాపల్లా
ఆ కొండలు కనిపిస్తుండేవి
మేఘాలు దయతలచి
కురిపించిన వాన చినుకులతో
తల్లిని చేరిన పిల్లల్లా
కళకళలాడుతున్నాయిప్పుడు
వట్టి రాళ్లగుట్టలు కావు
పచ్చని శ్వాసతో విలసిల్లుతున్న
తడియారని జీవనదులవి..!

కనువిందైన చూపుల అనుభూతికి
స్ఫూర్తి వంతమైన పదాలను జొప్పిస్తు
వినసొంపైన వాక్యాల అల్లికలతో
అవిశ్రాంతంగా ఊపిరిపోస్తుంటాను
నిన్నెప్పటికీ వదలని మిత్రునిలా
ఎన్నెన్నో ముచ్చటించాలనుకుంటాను
నా హృదిలో నీ దృశ్యము చెరిగిపోదు
చెక్కుచెదరని దృఢత్వం నీదే కదా..!

చెట్టును వదలని పక్షిలా
మనిషిని వదలని నీడలా
ప్రియున్ని వదలని ప్రియురాలులా
విప్లవాన్ని వదలని వీరుడిలా
కవిత్వాన్ని వదలని కవిలా
ఎత్తైన కొండలిప్పుడు
పచ్చని కంబళిని చుట్టుకొని
సౌందర్యవంతంగా అలలారుతున్నాయి..!

నాకెందుకో శిఖరాలంటే
అపరిమితమైన ఇష్టం
ఆకాశాన్ని ముద్దాడుతున్న
అంచుల్ని అలుముకోవాలని ఇష్టం
ఎడతెగని ఆలోచనల్లా
వెంటాడుతుంది ఒక స్వప్నం
నీ పాదాల చెంతవరకు
నడక సాగుతుంది చింతలు లేకుండానే
నీ పై జరుగుతున్న దాడులను చూసి
అల్లకల్లోలమైన
సముద్రమౌతున్నది మనసు..!

సహజ సిద్ధమైన ఖనిజాలకు గనులు
మానవ నాగరికతను
చాటుతున్న ప్రతీకలు
జీవన వైవిధ్యానికి
ఆధారమైన తరువులు
గ్లోబలీకరణ మాయాజాలంలో
ఉనికిని కోల్పోతున్నవి
ఉక్కు శిలల వంటి
కొండల వరుసలన్నీ
మానవ ధన దాహానికి
ఆవిరైపోతున్నవి
చేయి చేయి కలుపుదాం..
ఒక్కటై నిలబడదాం
ప్రకృతి సంపదను
భావితరాలకు అందిద్దాం..!

– గోపగాని రవీందర్
9440979882

నేడే కావాలి

పల్లె పల్లెల్లో
గుడిసె గుడిసెల్లో
సంతోషం కరువై పోతుంటే
గుండె తలుక్కు పోతుంది !

ఆకాశం నుంచి గంగ పొంగి
చిందులేస్తోందనుకొంటే
పల్లె పల్లెల్లో
గుడిసెల్లో
గడప గడపల్లో
మధ్యం ఏరులై
పొంగి పొరలుతుంటే
గుండె తలుక్కు పోతుంది !

మధ్యం ప్రవాహానికి
ఎన్ని గుడిసెలు
కొట్టుకు పోయాయో?
ఎందరి ఆడబిడ్డలు జీవితాలు
చితికి పోయాయో?
ఎందరి ఆశలు
బుగ్గి పాలైనయో?

యాధికొస్తే
గుండె తలుక్కు పోతుంది !

ఈవన్ని చూస్తూనే
కొందరు..
కోటలు దాటే మాటలు
ఎన్నెన్నో తీపి కోతలు
విని విని విసుగెత్తి పోతుంది
అయిన ఎదో మారిపోతుందేమో
అనే భ్రమలో వుండగానే
ఆ పుణ్య కాలం కాస్తా
కరిగి పోతుంది !
కరిగి పోతుంది!!

కరిగి పోతున్న కాలంలా
మధ్యం కనుమరుగయ్యే
కాలముంటే
ఎంత బాగున్నొ
అలాటి కాలమొస్తే
ఎంత బాగున్నొ
వస్తే..
నేడే రావాలి!
నేడే కావాలి!!

–లక్ష్మీ శ్రీనివాస్
9676601192

ఆందోళన వద్దు- ఆత్మనిర్భరతే ముద్దు

"హైటెక్ యుగంలో " జీవితం పరుగులమయమైపోయింది. ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు మానవులు ఎన్నో ఒడిదొడుకులకు గురౌతున్నారు. మారుతున్న కాలానికను గుణంగా అన్ని విషయాలలో మాన వుడు వేగాన్ని పెంచాడు. అన్ని రంగాలలో సంపూర్ణ పోటీతత్వం పెరిగి పోయింది. భౌతిక సంపద పై మోజు పెరిగింది. అందరి కంటె ఎక్కువ ఆర్థిక సంపద కలిగివుండాలన్న "వాణిజ్యవాదం" రాజ్యమేలుతుంది. భౌతిక సంపదపట్ల కాంక్ష పెరిగి బౌద్ధిక తాత్వికత తరిగి మానసిక ఆందోళన తో ఒత్తిడి మనిషి పాలిటి శాపంగా పరిణమించింది. 70 శాతం ఆరోగ్య సమస్యలు కేవలం ఒత్తిడి వల్ల వస్తున్నాయని పలు ఆరోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రతి ఒక్కరు కాలంతో పాటు పరుగులు పెడుతున్నారు .నేటి కాలంలో ఒత్తిడి అన్ని వయసుల వారికి సర్వసాధారణమైపోయింది. ఇలాగే ఒత్తిడితో కాలం గడిపే వారికి భవిష్యత్తులో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒత్తిడి వల్ల "ఎమోషన్స్" పెరిగి "యాంగ్జియిటి "డిప్రెషన్ "కు దారితీస్తుంది. ఒత్తిడిని ప్రారంభంలో అదుపు చేయకపోతే ఒత్తిడి ముదిరి "డిప్రెషన్కు "దారి తీస్తుంది. దీని వల్ల తలనొప్పి ఆందోళన అలసట చిరాకు 'చికాకు, బిపి మధుమేహం వంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

జీవితంలో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కాలంతో పాటు పరిగెత్తాల్సిందే పోటీ ప్రపంచంలో జీవన పోరాటంలో విజయం సాధించాలంటే పోటీ పడాల్సి వస్తోంది. ప్రతిభ సామర్థ్యాలను పెంచుకోవడానికి తప్పక పోటీ పడాల్సిందే ఈ క్రమంలో ఎదురయ్యే ఒత్తిడిని

అదుపులో ఉంచుకోకపోతే అనారోగ్యం చుట్టుముట్టే ప్రమాదం వుంది. ఒత్తిడిని తట్టుకోవడానికి ఆహారంలో కొన్ని మార్పులు చేసు కోవాలి .మానసిక ప్రశాంతతకు మించిన సంపద లేదు అన్న వాస్తవాన్ని అందరు గుర్తించాలి.

మానసిక ఒత్తిడి నితగ్గించుకొనే మార్గాలు

మానసిక ఒత్తిడి తగ్గించుకొనే మార్గాలు "నిద్ర"మనిషి జీవితంలో; తప్పక ఉండాలి ప్రస్తుత జీవన శైలిలో నిద్ర పోవడం క్రమంగా తగ్గుతువుంది . కనీసం మనిషికి రోజుకు 7 లేదా 8 గంటలు నిద్ర పోవాలి. నియమ బద్ధమైన నిద్ర మంచి ఆహార అలవాట్లు ఉండాలి. ప్రతి వ్యక్తి చింత ఆందోళ నల మీద అదుపు కలిగి వుండాలి. "చిరునవ్వు" ప్రతి వ్యక్తి "భూషణం" అవుతే దూషణలు దూరమై ''ఆనందం ''దరిచేరుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో ఆరోగ్యంగా ఉండగలరు .మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి .ఒత్తిడి తగ్గాలంటే వ్యాయామం తప్పక

ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు మానవులు ఎన్నో ఒడిదొడుకులకు గురౌతున్నారు

చేయాలి. కనీసం రోజుకు 30 నిమిషాల పాటు ఉదయం "నడక" వ్యాయామం చేయాలి. "యోగ" "ప్రాణాయామం" శ్వాస మీద ధ్యాస "ధ్యానం" చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండటానికి సహాయ పడుతుంది. వ్యాయామం వల్ల 'సిరోటోనిన్ టెస్టోస్టెరాన్' విడుదల అవుతుంది మనసు నిలకడగా వుంటుంది. నెగెటివ్ ఆలోచనలు తగ్గి ఆత్మనిర్భరత సాధ్యమౌతుంది .యాంటీ ఆక్సిడెంట్లు విటమిన్ బి2' ''బి 12'' విటమిన్లు 'మినరల్స్ "విటమిన్స్" వుండే ఆహారం "పోషకా హారం" తీసుకోవాలి. మాంసకృత్తులు క్యాలిస్యం వున్న ఆహార పదార్థాలు తీసుకోవాలి . పాలలో ఉండే "లాక్టియం" అనేది మెదడుకు ఎంతో ప్రశాంతతనిస్తుంది .ఇందులో ఉండే "బయోయాక్టివ్ ప్రోటీన్" దీనికి కారణం .ఈ ప్రోటీన్ వల్ల ఒత్తిడి నుంచి ఉ పశమనం కలుగుతుంది .

పాలలో "పొటాషియం" వుం టుంది ఇది కండరాల నొప్పులను తగ్గిస్తుంది..కాఫీ టీలు తగ్గించాలి . పాలలో నిమ్మరసంలో తేనెను కలుపుకొని తాగితే ఒత్తిడి తగ్గి ఉ పశమనం లభిస్తుంది.

ఏదైనా ఒక పని చేసేముందు ఎలా చెయ్యాలి అన్నది ప్లాన్ వేసుకోవాలి ఎప్పుడు చేయాలి? ఎంత సమయం కేటాయించాలి?

ఇలా చేస్తే ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి మొన్నగు విషయాల మీద ప్రణాళిక వేసుకోండి. మీరు పనిచేసే చోట ఇబ్బంది పడకుండా చూసుకోవడం కోసం ప్రయత్నించండి .ప్రణాళిక ప్రకారం వెళ్లితే సమస్యల పరిష్కారాలకు అవకాశాలు ఎక్కువగా వుంటాయి. తీసుకునే ఆహారం కూడా ఒత్తిడి తగ్గించడానికి ఉపయోగ పడు తుంది .మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్య సమస్యలు ఉండవు. కూరగాయలు' పప్పు దినుసులు " మాంసం 'చేపలు" తీసుకోవాలి . 'కార్బోహైడ్రేట్స్ ప్రోటీన్స్' ఉన్న ఆహారం తిన్న వారికి ఒత్తిడి తక్కువగా ఉ ంటుంది.

పాజిటివ్ దృక్పథ

ఒత్తిడి తగ్గాలంటే ప్రతి వ్యక్తి "పాజిటివ్ దృక్పథం" ఉత్తమ ఆలోచనా విధానం "సమాజ సేవా" భావన "సమర్పణ భావం" కలిగి వుండాలి.

సమస్యల పరిష్కారం కోసం ప్రతివ్యక్తి పాజిటివ్ దృక్పథం అలవరుచుకోవాలి.

సమస్యను భూతద్దములో చూసే ధోరణి విడనాడాలి. సమస్యను అన్ని కోణాలనుంచి విశ్లేషిస్తే పరిష్కారం దొరుకుతుంది. ఒత్తిడి నుండి ఉ పశమనం కలుగుతుంది .

సకాలములో ఆహారపు అలవాట్లు మంచి ఆహారం మంచి స్నేహితులను కలిగి వుండడం వలన బాధలు పంచుకోవడం సంతోషాన్ని పెంచు కోవడం వల్ల ప్రతికూల సమయాలలో సహాయ కారిగా వుంటుంది. రోజు వారీ భావోద్వేగాలను ఒక పుస్తకము లో రాసివిశ్లేషించుకొండి.ఇది ఒత్తిడి నుండి ఉపశమనం ఇస్తుంది. దురాలోచన కలిగిన వారికి దూరంగా వుండాలి. ఒంటరి తనాన్ని దరిచేరనీ యద్దు. స్నేహితులతో వుంటే నిరాశ జనకమైన ఆలోచనలుదూరమౌతాయి. పరులను నిందించే దృక్పథం విడనాడాలి. మన ఆధీనములో లేని విషయాల గురించి పరిస్థితుల గురించి పట్టించుకోవద్దు. విపరీత ధోరణులు దారుణ సంఘటన లు పరిస్థితులపై అతిగా ఊహించవద్దు స్పందిచవద్దు ..దీనివల్ల స్ట్రెస్ పెరిగి విజయావకాశాలు కనుమరుగు అవుతాయి. మానసిక వైద్య నిపుణు లను సంప్రదించి సలహాలు పాటిస్తే ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. జంతువుల పెంపకం పూలతోటల పెంపకం ఉద్యానవనాలనిర్వహణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న దం వల్లఒత్తిడిని జయించ వచ్చు. వర్తమానంలో జీవించండి ఎప్పుడు? ఎక్కడ? లేక రేపు? అనే వాటికి బదులు ఇప్పుడు" ఇక్కడ" లేక " ఈరోజు" అని ఆలోచించండి. ఇతరుల ఇష్టాల మీద కాకుండా మీ "ఇష్టం" మీ "తృప్తి" మీద "ధ్యాస" వుంచండి. సంతృప్తిని మించిన సంతోషం లేదు "శృంగార

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 687వ రోజు 'మూలిగే నక్కపై తాటిపండు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'మూలిగే నక్కపై తాటిపండు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

లోకం తీరే అంత

మూలిగే నక్కపై తాటిపండు
మూలిగే ముసలిపై మాటల వేటు
చేతల చోటు
గోరుచుట్టపై రోకటి పోటు!!.
నడి వయసులో పిల్లలపై ప్రేమ
ఎన్నో ఆటుపోట్లు
పెంచి పెద్ద చేయాలన్న తాపత్రయం
ఉన్నతపథంలో పయనింప చేయాలని
స్వార్థం మరచి
సౌఖ్యం వదలి
పొద్దస్తమానం వంత
అభివృద్ధికై చింత
ఎదిగిన పక్షి ఎగిరింది చిత్రం
తనకేమీ వద్దని వదిలేసి!!.
ఉడిగిన వయసు
దెబ్బమీద దెబ్బ
అప్పులు కట్టలేక తిప్పలు
ఉన్న ఇల్లు జప్తు
వీధినపడ్డ దుస్థితి
ఎవరికెవరు ఈ లోకంలో
లోకులు పలుకాకులు
పొడవడమే వారి లక్ష్యం!!.
సూటిపోటి మాటలు
ఈటెల దంపుడు
ఆర్థికంగా హార్దికంగా
ఉన్నదానిలో
చేతనైనంతలో
ఒకప్పుడు ఎందరినో ఆదుకున్న తీరు
ఇప్పుడు పయనం బాధల తేరులో!!
నాడు పదిమందికి పెట్టిన చేతులు
పరుగెత్తిన కాళ్ళు
మూలుగుతున్న ముసలి
పడింది ఓ మూల
లోకం తీరే అంత
వేటుపై వేటు
పోటుపై పోటు
అందరూ ఉన్న
వచ్చేవారు సున్న
నలిగిన మనసుతో
కాలం ఈడుస్తూ
సమయం కోసం చూస్తూ....!!.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

గుండె దిటవు

అనారోగ్యంతో
తండ్రి మంచం మీదుంటే
కుమారుడికి
రోడ్డు ప్రమాదం జరిగినట్టు
ఇల్లు గడవడం
కష్టంగా ఉన్న దంపతులకు
ఒకే కాన్పులో
ముగ్గురు శిశువులు జన్మించినట్టు
ఐదుచోట్ల బోర్లేసినా
నీళ్లురాక రైతు మనాదిపడ్డే
అప్పిచ్చినోడు ఆగక
ఇంటికొచ్చి అల్లరి చేసినట్టు.
బాధలో ఉన్నవారికి బాధ తగ్గితే
ఆపదలో పరిష్కారం దొరికితే
గొప్ప సంతోషం
తగ్గని బాధకు బదులు
కొత్త కష్టమొస్తే
మూలిగే నక్కపై
తాటిపండు పడ్డట్టే!.
జీవితమంటేనే
కష్ట సుఖాల కలబోత
సుఖాలకు పొంగిపోవడం
దుఃఖానికి కుంగిపోవడం
చేయనివారే స్థితప్రజ్ఞులు
చిన్నతనంనుండే
దయ్యాలనీ రాక్షసులనీ
పోలీసనీ బూచాడనీ
ఎవరికి నచ్చినట్టు వారు
పిల్లల మెదళ్లలో
భయాన్ని ఇంజెక్టు చేస్తుంటే
ప్రతీదీ భయంతోనే మొదలు పెట్టి
జీవితమనే పరీక్షలో
ఫెయిల్ అవుతుంటారు
తాటిపండు పడ్డా
తట్టుకునే గుండె దిటవు కావాలి
పరిస్థితులకు కుంగిపోని
నైజం సొంతం కావాలి

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

సమస్యల సుడిగుండాలు

ముందే కరవు కాటకం
ఆపై పశుగ్రాసపు కొరత
ఉన్నపంటైనా చేతికొస్తుందంటే
వడగళ్ళతో పంటనాశనం.
సాయం చేసే దాతలెవరైనా
ముందుకొస్తారనుకుంటే
ఆపై నోట్లను రద్దు చేసిన చందం
ప్రభుత్వ ఉద్యోగులను
అప్పు అడుగుదామంటే
ఒకటో తేదీకి జీతం
వస్తుందో రాదో తెలియని స్థితి
ఉద్యోగార్థులందరికి
ఉద్యోగాలు వస్తాయనుకుంటే
ఎన్నికల నగారా మోగిందంటూ
నియామకాల ఆపివేత
నెలజీతంలో
ఎంతోకొంత మిగలవచ్చనుకుంటే
ఏదో వేడుక
అకస్మాత్తుగా వచ్చిచేరినట్లు
వస్తాయనుకున్న
డబ్బులు చేతికి రానప్పుడు
వచ్చేజీతం కరోనా కాలంలో
తగ్గించినపుడు
సమస్యల సుడిగుండాల్లో ఉన్నప్పుడు
కొత్త సమస్యలు మీద పడితే
పెనంపైనుండి
పొయ్యిలో పడినట్లేగా!
మూలిగే నక్కపై
తాటిపండు పడినట్లేగా!
విహంగంలా ఎగసి
గగనాన్ని చుంబిస్తామనుకుంటే
అధః పాతాళంలోకి పడిపోతే
కెరటంలా పైపైకి
ఎగసిపోదామనుకుంటే
లోయల్లోనికి పడిపోతే
ఆశల సౌధంలోకి
అడుగుపెట్టేదెపుడు
జీవితగమనంలో
అగ్రపథాన నిలిచేదెప్పుడు?.

-లక్ష్మారెడ్డి పసుల

నవ్వే వాడి ముందు జారి పడ్డట్టు

పార్టీ అధ్యక్షుడు రాజీనామా చేసి
తమదసలు పార్టే కాదని
ప్రత్యర్థి పార్టీలో చేరినప్పుడు.
గెలుపు ఖాయమనుకున్న చోట
ఓటమితో పాటు
డిపాజిట్ గల్లంతైనప్పుడు
ప్రేమించిన భార్య విడాకులిచ్చి
సగం ఆస్తిని
భరణం కింద పొందినప్పుడు
జట్టు నాయకత్వం పోయిందనుకుంటే
అసలు జట్టులోనే స్థానం పోయినప్పుడు
పోటీలో బహుమతి తప్పదనుకున్న కవిత
ప్రచురణకే నోచుకోక
అది కవిత్వమే కాదని
మొట్టికాయలు పడ్డప్పుడు
బాసుతో తిట్లు తింటుండగా
తోటి ఉద్యోగి
ముసిముసిగా నవ్వినప్పుడు
సంపాదించిన కోట్ల ఆస్తి
కొడుకు లాక్కొని
తను కట్టించిన
శరణాలయంలోనే చేర్చినప్పుడు
ప్రియురాలి మెప్పుకోసం
తలకు మించి అప్పుచేసి కొన్న
నగలబిల్లు ధర్మపత్నికి దొరికినప్పుడు
మూలిగే నక్కపై తాటిపండేం ఖర్మ
తాటిగెలే పడ్డట్టు గదా!.

-గుర్రాల వేంకటేశ్వర్లు

దెబ్బ

దెబ్బ మీద దెబ్బ!
చూసుకో తడాఖా!
గోరుచుట్టుపై రోకటిపోటు!
ముక్కుతూ మూలిగేవారిపై!
రెక్కాడితేగాని
డొక్కాడని బతుకులు!
దిబ్బ చేసిన కరోనా గాయాలు!
అదే నయమన్పించేలా నేడు
వరదలూ పొంగే వాగులూ!
ఇంటినించి బైటకి పోలేక
మింగలేక కక్కలేక
మింగుడుపడని దుస్థితి!.
చేనేత అన్నల కడగండ్లు
మగ్గాల గుంటల్లో చేరే నీరు!
పంటచేలు మునిగే
రైతు కన్నీరు మున్నీరు!
ఎరువుల ధరతో నడ్డి విరిగే
అందని జీతాలు!
రోగాలు రొచ్చులతో బేజారు!
బస్సు విద్యుత్ చార్జీల మోత!
అప్పులకుప్పల్లో ప్రభుత్వాలు!
ఎన్నికలల్లో ఎన్నో కలలు
అందని ద్రాక్ష పళ్ళు!.
గద్దెపైవారికి లేదు ధోకా!
సామాన్యుడి పై తడాఖా!
మసిపూసి మారేడుకాయ
కళ్ళకు గంతలు!
ఊళవేస్తూ మూలిగే నక్కపై
ఊరకుక్కల దాడి!
నెత్తిపై ఠాప్ న తాటిపండు!
బుర్ర బద్దలై హరీ !
జగమంతా అల్లకల్లోలం!
గ్రహస్థితి బాగోలేదని ఘోష!
ఆశతో బతుకీద్వాలని
పెద్దల ఉద్ఘోష!. -ఎ.రాజ్యశ్రీ

ఒంటరి చీకటి గదులు

చదువు చారెడు
బలపాలు దోసెడు
చదివేది ఎల్కేజీ
మోసేది బోలెడు పుస్తకాల బ్యాగేజీ!
తల్లి కడుపులో పడ్డ నాటినుంచే
మంచి పాఠశాలకై వెతుకులాట
ఇంటర్వ్యూకు ఇంటిల్లిపాదీ ప్రిపరేషన్లు
ఇల్లు పీకి పందిరేసే చిన్నారి
ఇంటర్వ్యూలో పెదవి విప్పని వైనం!
మూలిగే నక్కపై తాటిపండులా
ఫీజులతో బాటు డొనేషన్ల భారం
ఆన్లైన్ విద్యతో అదనపు కల్లోలం
ప్రాజెక్ట్ పనితో
తల్లిదండ్రులకు జాగారం!
ఆటపాటలతో గడిచాయి
ఆనాటి చదువులు
పోటీ ప్రపంచంలో పరిగెత్తుతూ
అక్షరాలూ అంకెల పాలు
తాగుతున్నారు పిల్లలు!.
ఒత్తిడితో కూడిన చదువులు
ఒంటరి చీకటి గదుల్లో
బిక్కుబిక్కుమంటూ చిన్నారులు
పుస్తకాల పురుగులై
వ్యక్తిత్వ వికాసానికి
సర్వతోముఖాభివృద్ధికి
తావే లేక
వేళ్ళాడే ముఖాలతో
ఆనందం కోల్పోయిన బాల్యం!!!.

-చంద్రకళ దీకొండ

మధ్య తరగతి బతుకులు

తగిలిన వేలికే మళ్ళీ దెబ్బ
దెబ్బ మీద దెబ్బ
గోరుచుట్టుపై రోకటి పోటు
పేదవాడి కట్టెలపొయ్యి
ఎప్పుడో కాలిపాయే
రోజు రోజు గ్యాస్ ధర
పెరిగి ఆకాశమంతాయె
గ్రహచారం చాలక
ఎండ బాధ పడలేక
బట్టతలోడొకడు
తాటిచెట్టు కిందకు పోతే
తాటి కాయ తలమీద పడ్డ చందం
నేటి మధ్య తరగతి బతుకుల అందం
ఎవరెన్ని చెప్పినా ఎంత మాట్లాడినా
బండి మీద పోయి
బతుకు దెరువు చూడాల
సైకిలేమో లేకపాయే
నడిచిపోతే దూరమాయే
పెట్రోలు ధరలు పేట్రేగి
భారమెక్కువాయె
అందరితో కలిసి
బతుకంటే అగమ్య గోచరం
ఇంగ్లీషు చదువులాయే
స్కూల్ దూరమాయే
ఉన్ననగ అమ్మి స్కూల్ ఫీజు కడితె
రాను పోను బస్సుకేమో
అమ్మడానికి ఏమి లేకపాయే
దెబ్బ మీద
దెబ్బ తట్టుకొని బతుకుడాయే
అప్పుల బాధతో
సెల్ ఫోన్లో లోన్ కొడితే
రుణదాతల ఒత్తిళ్లు
నిత్యం ఇవే కడగండ్లు

-మోటూరి శాంతకుమారి

అవరోధపు విద్యుత్ గాయాలు

ఆశల జీవితాలపై
ప్రభుత్వ తాటిపళ్ళ మోత
చదువరి బడికెళితే
తల్లిదండ్రులకు
తలకెత్తలేని ఫీజుల బరువు
గొప్పలకు పోయే తల్లులకు
అవమానం
తప్పదు తాటిపళ్ళ మోత!!
పుస్తకాల మోతకి భయపడి
బరువు తగ్గిస్తే
బడిలో బెత్తం మోత
చదువు మాట దేవుడెరుగు
వేటు మీద వేటు
చదువుల యంత్రాంగ చేతలు!!
ఆశగా ఎదురు చూసే జీతాలు
అవరోధపు విద్యుత్ గాయాలే
పెరిగే ధరలు
మాట బయటపడని మధ్యతరగతి
కేకలా లోలోన
మండించే అగ్నిశిఖ
అంతరాళాన్ని దగ్ధం చేస్తుంటే !!
ఆనాడు ఒక్క దెబ్బకే చచ్చే
తాటి పండు వల్ల నక్క
నేడు ప్రతి మనిషీ
అడుగడుగునా
చావుదెబ్బలు తట్టుకోలేక
బతకాలా వద్దా అనే
మీమాంసలో
దిన దిన గండం నూరేళ్ళాయుష్షు
అన్న వరవడి లో
కాలం వెళ్ళదీస్తున్నాడు!!.
తక్కువ ధరలవి కొని
పబ్బం గడుపుదామంటే
ఏది చూడు ఆకాశాన్నంటే
అందుకో వీలు లేదు
అందని ద్రాక్ష లాయె!!
ఆశగా ఎదురు చూసే
జీతపు సరళి
అవరోధపు
తాటి పళ్ళ తలంబ్రాలు
పెరిగే ధరల ధోరణి
ముంచు ప్రతి నిముషం.

-కె.కె.తాయారు

బాధలో బాధ

జీవితం సమస్యల మయం
సమస్యలేని రోజు లేదు
సమస్య లేని మనిషి లేదు
సమస్యలతో నిరంతర పోరాటమే
ఉన్న బాధలతో సతమతం
కొత్తగా పెను బాధలు
నక్క దెబ్బలతో మూలుగుడు
ఆ పైన తాటి పండు రాలి పడితే
దాని బాధ వర్ణణాతీతం.
చాలీ చాలని జీతాలతో
జీవితాలు నెట్టుకొస్తున్న
సగటు జీవి
నిరంతరం పెరుగుతున్న
నిత్యావసరాలు
కొనటమే గగనం
కరుణ లేని కరోనా దాడి
తాటి పండు పడటమే!.

-మోటూరి శాంతకుమారి

గుండమీద కారం

మూలిగే నక్కపై తాటిపండు
పుండు మీద కారం
బాధ వర్ణణాతీతం
చెప్పుకుంటే గంగలోకి పరువు
చెప్పుకుంటే పోయే ప్రాణం.
రిజిస్ట్రేషన్ చార్జీలతోనే బాధైతే
జియస్టీ విధింపు
తలప్రాణం తోకలోకి తెచ్చినట్టు
పదోన్నతులూ బదిలీలూ లేక
బాధపడుతున్న ఉద్యోగులకు
నెలాఖరు దాక జీతాలు వస్తున్నట్టు
పార్థివ దేహాన్ని చూసి
బాధపడుతున్నోళ్ళను
బిళ్ళకట్టి తీసుకుపొమ్మన్నట్టు
తినటానికి తిండిలేనోడిని
తలకు సంపెంగ నూనె
రాసుకుంటే బాగుంటుందన్నట్టు
నిత్యం అప్పులతో
సతమతమవుతున్నోడి బిడ్డకు
ప్రైవేటు కాలేజీలో
పేమెంట్ సీటు
నవ్వాలో ఏడ్వాలో తెలియనట్టు
తక్కువ పంట రాబడితో
బాధపడుతున్న రైతుకు
వడగండ్ల వానతో పంట
సర్వనాశనం అయినట్టు
ఫ్యానుకన్నా కూలరైతే
బాగుండేది అనుకునేటప్పుడు
ఉన్న కరెంటు ఊడిపోయినట్లు
పదోన్నతి కోసం కార్యాలయానికి వెళితే
ఉన్న ఉద్యోగం ఊడిందని
ఉత్తర్వులు అందించినట్లు
ఆకలిమంటతో అలమటిస్తే
కారంమంటతో పెరిగిన మంట
అడ్డెడు వడ్లకోసం
అరువుకు పోతే
ఉన్న బుడ్డెడు వడ్లు
దుడ్లే తినిపోయినట్టు
కష్టాలను అధిగమించాలి
నష్టాలు దరిచేరకుండా చూడాలి
అత్యాశలకు పోవద్దు
కష్టాలపాలు కావొద్దు
కష్టసుఖాలు దైవాధీనాలు
భరించాలే తప్ప కుంగిపోరాదు
ఇతరులను నిందించరాదు
ఉరిమి ఉరిమి పిడుగు
మంగళం మీద పడ్డట్టు కారాదు.

-గుండం మోహన్ రెడ్డి

అభాసుపాలు కావడం

గోరంత దానికి కొండంత చేసినట్టు
ఏదో చేయబోయి ఇరుకున పడ్డట్టు
అయిన దానికీ కానిదానికీ చేయిజారినట్టు
మధ్యలో పోయి అభాసుపాలు అయినట్టు
ముందు మనగరించి
మనం తెలుసుకోవాలి
ఒకని చెంతలోకి
ఎందుకు పోవాలి
నీకన్నా ఒకడు ఎక్కువగానే ఉంటాడనుకోవాలి
అన్నిటిని తెలుసుకున్నవాడే మనిషి అనుకోవాలి
జీవితం
నిరంతరం సమస్యల వలయం
స్థితి గతులను నిర్ణయించే దృక్కోణం
పరిస్థితులు ఎదుర్కొనే పయనం
పోటీ ప్రపంచం లోని ప్రయత్నం
పడుతున్న కష్టాలకు సుఖమెప్పుడో
చేస్తున్న వ్యవహారాలకు ఫలితమెప్పుడో
కలసి వచ్చే కాలం కోసం ఎదిరి చూసేదెప్పుడో
అంతా జరిగాక ఆనందించేదెప్పుడో
గోరు చుట్టపై రోకటి పోటు అన్నట్టు
చంపిందాన్ని ఇంకా చావ గొట్టినట్లు
తేలుకుట్టిన కోతి కళ్ళు తాగి చిందులేసినట్టు
నయవంచకులు నక్కవినయాలు నటించినట్టు
గత్యంతరం లేకుండా గమ్యం తెలుసుకో
మర్మం లేకుండా మసలడం మార్చుకో
నిర్ణయం లేకుండా సాధించడం నేర్చుకో
కష్టం లేకుండా
అభాసుపాలవడం మానుకో.

-గుండవరం కొండల్ రావు

ఈనెల 13న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన "కనువిప్పు" బాలల కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ . చిత్రంలో ఎడమ నుండి వరుసగా (ఎడమ నుండి) ఈ వేమన, తిరుమలాచార్యులు , శ్రీరాములు, పారి నాయుడు , మంచిపుస్తకం ట్రస్టీ కొసరాజు సురేష్, బాల సాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు , కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు నారంశెట్టి, బెలగాం , తుంబలి శివాజీ, సంకా గౌరీశంకర్ , నారంశెట్టి పీఠం ప్రధాన కార్యదర్శి గుడ్ల అమ్మాజి ఉన్నారు.

స్వ. పాతూరి మాణిక్యమ్మ జాతీయ స్థాయి స్మారక సాహిత్య పురస్కారం

కవితా సంపుటులకు ఆహ్వానం

స్వ. పాతూరి మాణిక్యమ్మ స్మారక జాతీయ స్థాయి సాహిత్య పురస్కారం-2022 కొరకు కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నాము. 2021లో ప్రచురింపబడిన వచన కవితా సంపుటులను మాత్రమే ఈపోటీకి పంపవలెను. ఎంపిక అయిన ఉత్తమ కవితా సంపుటికి 5,000/- నగదు బహుమతి అందించబడును. పరిశీలనా నిమిత్తం రెండు కవితా సంపుటులను డిసెంబర్ 2022 లోపల (31-12-2022) ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

డా॥ పాతూరి అన్నపూర్ణ, 1156/28-1 ప్రశాంతినగర్, నవలాకుల గార్డెన్స్, నెల్లూరు-524 002. సెల్: 9490230939

సోమవారం డా॥పి.వి. ఉమాశశి రచించిన "వర్తమాన తెలుగు దినపత్రికలో భాషా విశేషాలు భారతం పంచ నాయకం" పుస్తకావిష్కరణలో దైవజ్ఞ శర్మ, కళా వి.యస్. జనార్ధనమూర్తి, మారుమాముల దత్తాత్రేయ శర్మ, ఆచార్య స్వరాజ్యలక్ష్మి, ఆచార్య వి. నిత్యానందరావు, ఆచ్యా గౌరీశంకర్,

నానీలు

నను చూస్తూ
పుస్తకంలో నెమలీక
బాల్యస్మృతులను
గుర్తు చేస్తూ
వెదురు
దేహమంతా గాయాలు
జ్ఞాపకాలుగామలచుకుని
వేణువయ్యింది

ప్రేమించినంతకాలం
తెలియదు
నీ జ్ఞాపకాలు
వ్యాపకాలవుతాయని

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

బాలకవికి బాలరత్న పురస్కారం

బాలల దినోత్సవం సందర్భంగా శ్రీ కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు మరియు కమలాకర లలిత కళాభారతి వారు పిల్లల లోని ప్రతిభను వెలికితీసేందుకు వారియొక్క రచనలు మరియు ప్రజ్ఞాపాటవాలను పరిగణనలోకి తీసుకుని కొంతమందిని ఎంపిక చేయడం జరిగింది. దాదాపు 100 దరకాస్తులు రాగా వారిలో 20 మంది మాత్రమే ×బాలరత్న పురస్కారానికి× ఎంపిక అయ్యారు. ఎంపిక అయిన వారిలో ప్రముఖ కవయిత్రి రచయిత్రి శ్రీమతి సత్యనీలిమ,లక్ష్మీ నరసింహ శర్మ ల తనయుడు బాలకవి చిరంజీవి వలిపే రామ్ చేతన్ ×బాలరత్న పురస్కారం× నకు ఎంపిక అయ్యాడు. ఈ బాలకవి రచించిన ×అక్షరచైతన్యం,పచ్చపచ్చని కథలు× ఈరెండు పుస్తకాలు పోటీకి పంపగా బాలకవి రచించిన ×పచ్చపచ్చని కథలు× పుస్తకం బాలరత్న పురస్కారానికి ఎంపిక అయినట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమతి భారతీ కమలాకర్ గారు తెలియజేశారు. ఆదివారం (20-11-2022) రోజు శ్రీ త్యాగరాయగాననసభ లో బాలకవి వలిపే రామ్ చేతన్ కు ముఖ్య అతిథి శ్రీ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ గారు చైర్మన్ తెలంగాణ బి.సి కమీషన్,విశిష్ట అతిథులు శ్రీ జస్టిస్ నేరెళ్ళ మాల్యాది గారు,డాక్టర్ పి.ఎస్. మూర్తి గారు,సభాధ్యక్షులు శ్రీమతి ప్రొఫెసర్ ఎం.సులోచన గారు,గౌరవ అతిథులు శ్రీ లక్ష్మణ సాయి మ్యూజిక్ డైరెక్టర్ గారు, ప్రముఖ కవయిత్రి శ్రీమతి శశిబాల గారు,శ్రీమతి కామేశ్వరి గారు,శ్రీమతి అత్తులూరి విజయలక్ష్మి గారు మరియు ట్రస్టు అధ్యక్షులు శ్రీమతి భారతి కమలాకర్ గార్ల చేతులమీదుగా ×బాలరత్న పురస్కారం× ఇచ్చి సత్కరించారు. చిన్న వయసులోనే రెండు పుస్తకాలు వేసి పలు సంస్థలతో అవార్డులు పొందిన చిరంజీవిని అందరూ ప్రశంసించారు.



కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
(నేటినిజం ప్రతినిధి)

'బుధవారం బాధ్వా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి (ప్రథమ)

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

నేలకొరిగిన నట శిఖరం

ఘట్టమనేని ఇంటి పేరు
సాహసం ఒంటి పేరు
మంచితనానికి మారు పేరు
నవనీతం మనసు తీరు
తెగువన తనకు సాటెవరు రారు.
ధైర్యం తన రక్తంలో మమేకం
ముందడుగేయడంలో
ఉంది మొండితనం
కృషి ప్లస్ కసి నిండిన వ్యక్తిత్వం
కృషితో నాస్తి దుర్భిక్షమన్న
పదానికి అర్థం-
మంచి మనసున్న మారాజు
ఈ అల్లూరి సీతారామరాజు
జనుల మదులు గెలిచిన రారాజు
ఈ మకుటం లేని మహారాజు
కొత్త ప్రయోగాలకు
తానే యువరాజు
ఈ రామరాజ్యంలో భీమరాజు
ఘనులను ఢీకొని గెలిచిన ఘనుడు
ఈ అతని కంటే ఘనుడు
నిర్మాతల మనసు దోచిన దొంగ
ఈ దొంగలకు దొంగ
పరిశ్రమలో తనకు లేదెవరిపై కక్ష
తనకు తానే వేసుకునె నేరానికి శిక్ష
దాన గుణంలో కలియుగ కర్ణుడు
ఈ ధనవంతుడు గుణవంతుడు
కన్న ఊరిని ఉద్ధరించిన మనిషి
ఈ దేవుడు లాంటి మనిషి
అందమైన ముఖ వర్చస్సు
హృదయం ఇంద్రధనస్సు
నవ్వుతాడు మనోహరంగా
అంటాడు చల్ మోహనరంగా
నడిపించినా జగన్నాధ రథచక్రాలు
పండించినా పాడిపంటలు
మెండుగ ఉన్నా భోగభాగ్యాలు
సదా తనకండ తన మంచి మిత్రులు
నటశేఖరుని రికార్డులెన్నో
అనితర సాధ్యం
ఏడాదిలో పద్దెనిమిది
సినిమాల ప్రస్థానం
ఏటిలో
ఆరు శతదినోత్సవాలతో అగ్రస్థానం
త్రిశతాధిక చిత్రాల సినీ సింహాసనం
అధిరోహించిన పల్నాటి సింహం.
అందుకున్న పురస్కారాలు పుష్కలం
నటశేఖర, కళాప్రపూర్ణ, పద్మభూషణం
ఎన్ టి ఆర్ జాతీయ పురస్కారం
ఆస్ట్రేలియా తపాలా బిళ్ళపై ముఖచిత్రం
తానందుకున్న పురస్కారాల పరంపరం.
కళ్లారా చూసిన కొడుకు విజయం
తనివి తీరా గడిపిన జీవితం
వార్ధక్యంతో ప్రశాంత కాలధర్మం
పుణ్యం చేసుకుంటేనే దక్కే యోగం .
ఒక ధ్రువ తార నింగికెగసింది
ఒక నటశిఖరం నేలకొరిగింది
తేనె మనసు మూగబోయింది
మాటలకందని విషాదం మిగిలింది.
తెలుగు వెండి తెర వేలుపుల శకం
కృష్ణ అంతర్ధానంతో పరిసమాప్తం
అశేష హృదుల్లో తన స్థానం పదిలం
ఆ ఆత్మ చేరాలి
పరంధాముని పాద పద్మం.



-జె వి కుమార్ చేపూరి
96407 12062

కొత్త కొత్త నగిషీల తృష్ణ

ఘట్టమనేని కృష్ణ
గట్టి తలంపుల కృష్ణ.
తేనెలూరు హృదయంతో
తేనె మనసు చిత్రంతో
అడుగుపెట్టే చిత్రసీమలో
అందరి చిత్తసీమలో నిలిచే.
ఇందిరమ్మని పెళ్లియాడేనీ
ఇందివరుడు ప్రియసఖిగా
సాక్షి చిత్రంలో నటించిన
సాక్షిగా తిరుపతి వెంకన్నను నిల్పి
విజయనిర్మలకు తాళి కట్టి .
ఈ బుర్రిపాలెం బుల్లోడు
అందరి బుర్రలో నిలిచిపోయే
జేమ్స్ బాండ్ కౌబాయ్ అంటు
కొత్త కొత్త పోకడలు తాను పోయే
మన్యం పోరాట సూర్యుడు
అల్లూరి సీతారామరాజును
తాను పరకాయ ప్రవేశం చేసి
చూపేమన కనులముందు నిలిపె
సింహాసనం
తానెక్కేశౌర్య ప్రతాపాలతో
ఈనాడుతో చెడును పాతర వేసే
తొలిరంగుల సినిమా ముందు
తానుతెచ్చి
రంగారుబొమ్మల
కదలికల హ్వాయల్లతో .
మిరుమిట్లుగొల్పే
కమనీయఅందాల పోగేసే
పండంటికాపురంతో
పలురసాలు కురిపించే
పద్మాలయ స్టూడియో
వ్యవస్థాపకుడయ్యి
పదిమందికోసం
ప్రగతిప్రధాన నడిపించే

- విజయ కుమారి
9100634635

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.